# మండల్ కమిషన్ - జడలు విప్పిన కులతత్వం

మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తామని ప్రధాన మంత్రి ప్రకటించి ఇప్పటికి దాదాపు రెండు నెలలు కావస్తోంది. ఈ రెండు నెలల కాలంలో ఆ సిఫారసులకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా అగ్రకులాలకు చెందినటువంటి వాళ్లు చాలా పెద్దఎత్తునే ఆందోళన చేస్తూ ఉన్నారు. ఈ ఆందోళన అగ్రకులాల వాళ్ల ఆందోళన అనేది ఎక్కడా కనపడకుండా పత్రికలు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా అది అగ్రకులాల ఆందోళనే. ఎంతసేపూ మండల్ కమిషన్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నటువంటి, ఊరేగింపులు తీస్తున్నటువంటి విద్యార్థులు అని రాస్తారు తప్ప దాన్ని అగ్రకుల విద్యార్థులు చేస్తున్నారు అనే విషయాన్ని ఎక్కడా కూడా స్ఫురింపచేయకుండా పత్రికలు చాలా జాగ్రత్త పడుతున్నాయి. అయినా అది మనకు కనిపించేటువంటి వాస్తవమే.

ఇందాక వింధ్యగారు చెప్పినట్లు వాళ్లకి పత్రికల మద్దతు ఉంది. ప్రభుత్వం మద్దతూ ఉంది. పోలీసు యంత్రాంగం నిశ్శబ్దంగా ప్రేక్షకులుగా చూస్తూ ఉంది - వాళ్లు బస్సుల అద్దాలు పగల గొడుతున్నా, రాస్తారోకో చేస్తున్నా, ఇంకే రకమైనటువంటి హింసా కాండకు, విధ్వంసానికి పాల్పడుతున్నా. చివరికి దేశంలో చాలా బలవంతులు - బలవంతులు అంటే డబ్బు, ఆస్తి మాత్రమే కాకుండా చాలా ఇన్‌ఫ్లుయెన్షల్‌గా ఉండేటటువంటి వాళ్లు, కీలకమైన స్థానాల్లో ఉండేవాళ్లు - వాళ్ల మద్దతు కూడా చాలా ఉంది వీళ్లకు. ఉదాహరణకు చాలా ఆశ్చర్యం కలిగించే విషయం...

ఆ మధ్య బార్ అసోసియేషన్ తీర్మానం ప్రకారం కోర్టులు బాయ్‌కాట్ చేశారు ఒక రోజు. ఒకసారి నిరాకరించిన స్టేని మళ్లీ పరిశీలించమని చెప్పి సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అయిన కె.కె.వేణుగోపాల్‌గారు స్వయంగా నిన్న సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఇవాళే, ఒక పత్రికా విలేకరి చెప్తున్నారు సుప్రీంకోర్టు స్టే గ్రాంట్ చేసిందట. అంతిమ తీర్పు ఇచ్చేదాకా మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేయవద్దు అని చెప్పి సుప్రీంకోర్టు ఇవాళే, ఈ సాయంత్రమే కేంద్ర ప్రభుత్వానికి ఆదేశం కూడా ఇచ్చిందట. సుప్రీంకోర్టు న్యాయవాదులు ఈ రకమైన పాత్ర నిర్వహించటం సిగ్గుమాలిన చర్య. ఈ కేసు సుప్రీంకోర్టులోనే పెండింగ్‌లో ఉంది. మండల్ కమిషన్ సిఫారసులకు వ్యతిరేకంగా యాంటీ మండల్ కమిషన్ ఫోరమని, ఏదో మెరిట్ ఫోరమని, మరోటని, ఇంకోటని రకరకాల పేర్లతో హైకోర్టుల్లో వేసిన కేసులన్నీ కూడా సుప్రీంకోర్టు తానే స్వీకరించింది. తానే ఒక డేట్ ఇచ్చింది. నవంబర్ మొదటి వారం చివరి నుంచి వింటానని కూడా చెప్పింది. అటువంటి రిట్ పిటిషన్ విషయంలో సుప్రీంకోర్టు న్యాయవాదులు ఒక పక్షం తీసుకుని తామే తీర్పు ఇచ్చేసి, కోర్టు బాయ్‌కాట్ చేసి, అక్కడితో ఆగకుండా తామిచ్చిన తీర్పును కోర్టు కూడా ఆమోదించాలని చెప్పి, కనీసం స్టే ఇవ్వాలని చెప్పి మళ్లీ పిటిషన్ వేయటం అంటే వాళ్లు న్యాయవాదులుగా అక్కడ వ్యవహరించటం లేదు. ఆఫీసర్స్ ఆఫ్ ది కోర్టుగా వ్యవహరించటం లేదు. వాళ్లు ఏ ఏ కులాల్లో పుట్టారో ఆ కులాల ప్రతినిధులుగా మాత్రమే అక్కడ వ్యవహరిస్తున్నారని మనకు అర్థమవుతుంది.

ఎక్కడైనా ఒక అన్యాయం జరిగింది, కాల్పులు జరిగాయి, అన్యాయంగా ప్రజలను కాల్చిపారేశారు లేదా తరతరాలుగా వ్యవసాయం చేసుకుంటున్న భూముల నుంచి గిరిజనుల్ని నెట్టివేశారు, గెంటేశారు. అది రిజర్వు ఫారెస్టు అన్నారు. ఇది అన్యాయం. దీనికి వ్యతిరేకంగా సంతకం పెట్టమంటే ఈ న్యాయవాదులు పెట్టరు. లేదూ లాకప్‌లో పోలీసులు ఎవరినో కొట్టి చంపేశారు, ఒక సంతకం చేయండి, ఒక నిరసన తీర్మానానికి మద్దతు తెలపండని చెప్పి మనం పోతే లాయర్లు మామూలుగా ఎటువంటి మాటలు చెప్తారో పౌరహక్కుల సంఘానికి బాగా అనుభవమే. దాదాపు అందరికీ కూడా అనుభవమయ్యే ఉంటుంది. 'ఏమో చూడాలండి. పరిశీలించాలండి. ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేశారేమో. ఏదో మెజిస్ట్రీరియల్ విచారణకు ఆర్డర్ చేసినట్లుంది. అది కానివ్వండి చూద్దాం. ప్రభుత్వం న్యాయవిచారణకు ఆదేశిస్తుందని భావిస్తున్నాం. అదీ కానివ్వండి చూద్దాం. అంతా అయిన తర్వాత న్యాయం జరక్కపోతే అప్పుడు సంతకం చేస్తా'మంటారు. అటువంటి న్యాయవాదులు తమ కోర్టులోనే సబ్ జ్యుడీస్‌గా పెండింగ్‌లో ఉన్నటువంటి కేసు మీద తామే ముందుగా తీర్పు ఇచ్చేసి కోర్టు బాయ్‌కాట్ చేసి బయటకు వచ్చారు అంటే....అసలు ఈ రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన, మండల్ కమిషన్ వ్యతిరేక ఆందోళన కేవలం ఉద్యోగాల కోసం ఆందోళన కాదనేది

అర్థమవుతుంది. ఇది ఉద్యోగాల గురించి కొట్లాట కాదు. ఇది ఇప్పటికీ మన దేశంలో తొలగిపోనటువంటి కుల వ్యవస్థకు, ఈ దేశంలో అధికారాన్ని, సంపదను, ఆధిపత్యాన్ని, పెత్తనాన్ని, ఆస్తుల్ని నిలబెట్టటంలో చాలా కీలకమైన పాత్ర నిర్వహిస్తున్నటువంటి కులవ్యవస్థకు సంబంధించినటువంటి ఆందోళన....దాన్ని కాపాడుకునే ఆందోళన అనే విషయం మనకు అర్థమవుతుంది.

మామూలుగా చాలామంది అంటుంటారు. అసలు ఉద్యోగాలు ఎన్ని ఉన్నాయండి? ఆ మాత్రానికే ఇంత గొడవెందుకు అని. అసలు దేశంలో ప్రభుత్వరంగం ప్రాముఖ్యతే తగ్గిపోతోంది రోజు రోజుకూ. ఉన్నదే కొంచెం. ప్రభుత్వ రంగంలో ఇన్వెస్ట్ మెంట్ చాలా ఉంది గానీ, ఉద్యోగాలు చాలా స్వల్పం. ఆ ఉన్నదాన్ని ఇంకా తగ్గించు కుంటూ పోతున్నారు. ప్రభుత్వరంగంలో ఉన్న ఉద్యోగాలను అసలు నింపటమే లేదు, ఖాళీలను భర్తీ చేయటం లేదు. కొత్త ఉద్యోగాలు కల్పించటం కోసం ఇన్వెస్ట్‌మెంటూ లేదు. ప్రభుత్వరంగంలో గ్రోత్ లేదు. క్రమక్రమంగా ఆర్థికరంగాన్ని ప్రైవేటైజ్ చేస్తూ పోతూ ఉన్నారు.

మన చెన్నారెడ్డిగారు విద్యుత్ ఉత్పత్తిని కూడా ప్రైవేట్ సెక్టార్‌తో జాయింట్‌గా చేద్దామని ఆలోచిస్తున్నారు. ఇప్పటిదాకా ప్రభుత్వరంగంలో మాత్రమే ఉంది అది. ఇప్పటికే ఆస్పత్రులు, స్కూళ్లను ప్రైవేటైజ్ చేయటం మొదలుపెట్టారు. మన రాష్ట్రంలో మనకు కనబడుతూనే ఉంది. విద్యారంగంలో పూర్తిగా ప్రభుత్వం బాధ్యత వదిలేసు కుంటూ ఉంది. ప్రైవేట్ రంగానికి అప్పజెప్పేస్తున్నారు. ఆస్పత్రుల్లో కూడా ప్రభుత్వ రంగం బాధ్యత పోతూ ఉంది. క్రమంగా చాలా ఖరీదైనటువంటి రకరకాల ప్రైవేట్ క్లినిక్‌లు, ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు వస్తూ ఉన్నాయి. ప్రభుత్వరంగం పాత్ర క్రమంగా తగ్గిపోతూ ఉంది. అదొక విషయం.

వి.పి.సింగ్ ఏమన్నాడు? మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తాను అన్నాడు. తెల్లారి ఏమన్నాడంటే రాష్ట్ర ప్రభుత్వాల మీద నేను దీన్ని రుద్దను అన్నాడు. కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే వర్తిస్తుంది అన్నాడు. ఆయన ఆ మాట అనగానే హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి, ఒరిస్సా ముఖ్యమంత్రి మా రాష్ట్రంలో మేము అమలు చేయం అన్నారు. ఒకాయన వి.పి.సింగ్‌గారి పార్టీయే. ఇంకొకాయన వారికి మద్దతిచ్చేటువంటి బి.జె.పి. పార్టీవాడే. ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో కూడా అదే మాట అనే వాళ్లేమో కానీ కాకతాళీయంగా ఆ రెండు రాష్ట్రాల ముఖ్య మంత్రులు బీసీలయ్యారు కాబట్టి వాళ్లా మాట అన్లేదు.

అక్కడ కమల్‌నాథ్‌గానీ, జగన్నాథ్‌మిశ్రా గానీ ఉండుంటే....వాళ్లు కూడా మేం అమలు చేయమని చెప్పి అనుండేవాళ్లే. తర్వాత వి.పి.సింగ్ ఏమన్నాడు? కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా ఇది రక్షణ రంగానికి వర్తించదు అన్నాడు. అంటే సైన్యానికి వర్తించదు.

సైన్యానికే కాదు సైన్యానికి సంబంధించిన అనేక ఉత్పత్తులు కానీ, శాఖలు కానీ, వాటిని నిర్వహించే వాటికి కానీ ఇది వర్తించదు అన్నాడు. అలాగే సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాలకు వర్తించదు అన్నాడు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించేటువంటి విద్యాసంస్థలు - ఐఐటీలకు, లేకపోతే సెంట్రల్ యూనివర్సిటీలకు వర్తించదు అన్నాడు. అసలు విద్యా రంగానికే వర్తించదు అన్నాడు. ఇదంతా పోతే ఏం మిగిలింది? నాకు అర్థమైనంతవరకు మనలాంటి వాళ్లకి అందుబాటులో ఏం మిగిలింది అంటే.... పోస్టాఫీసులో గుమాస్తా ఉద్యోగము, టెలిఫోన్ శాఖలో టెలిఫోన్ ఆపరేటర్ ఉద్యోగము మాత్రమే మిగిలింది. మరి ఈ మహాభాగ్యానికి ఇంత ఆందోళన ఎందుకు? ఇటుగానీ, అటుగానీ అని ఎవరైనా ప్రశ్నించవచ్చును.

పౌరహక్కుల సంఘం ఏం భావిస్తోంది అంటే....ఇది ఉద్యోగాల కోసం జరుగుతున్న ఆందోళన కాదు. ఇది ఉన్న పిడికెడు ఉద్యోగాలను ఎట్లా పంచుకోవాలి అనే ఆందోళన కూడా కాదు. అట్లా అయినప్పటికీ కూడా తప్పనిసరిగా రిజర్వేషన్లు ఉండాల్సిందే. వాటిని సమర్థిస్తాము. కానీ ఇది కేవలం ఆ ఆందోళన మాత్రమే కాదు. ఆ ఆందోళనే అయితే ఇంత గొడవ జరగాల్సిన అవసరమే లేదు.

ఇవాళ ఈ రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలో, మండల్ కమిషన్ వ్యతిరేక ఆందోళనలో ఎవరైతే అగ్రభాగాన నిలబడి ముందుకొస్తున్నారో వాళ్లెవరికీ ప్రభుత్వ ఉద్యోగాలే అక్కర్లేదు. సుప్రీంకోర్టు లాయర్లు సుప్రీంకోర్టును బాయ్‌కాట్ చేస్తూ ఏమన్నారు? ఉద్యోగాలలో బీసీలకు కానీ ఎస్సీలకు కానీ ఎస్టీలకు కానీ రిజర్వేషన్లు ఇచ్చేస్తే దేశంలో ప్రతిభ నాశనమైపోతుంది అన్నారు. తమ పిల్లలకి ఉద్యోగాలు దొరక్కుండా పోతాయన్నారు. నిజానికి సుప్రీంకోర్టు లాయర్లలో ఎవరి పిల్లలకు కూడా ప్రభుత్వ ఉద్యోగాలు అక్కర్లేదు. వాళ్లొక్కొక్కరికి నెలసరి ఆదాయం యాభై వేల రూపాయలు, డెబ్బైవేల రూపాయలు, లక్ష రూపాయలు దాకా ఉంది. నెలసరి ఆదాయమే. సంవత్సరాదాయం కాదు. వాళ్లు తమ పిల్లలకు ఏ మల్టినేషనల్ కార్పొరేషన్‌లోనో ఉద్యోగం ఇప్పించగలరు. లేదు తమ ప్రాక్టీసే వారసత్వంగా పిల్లలకు సంక్రమిస్తుంది. ఆ పిల్లలకు ప్రతిభ ఉన్నా లేకపోయినా, టాలెంట్ ఉన్నా లేకపోయినా నాన్నగారు లాయర్ అయితే కొడుకు లాయర్ అవుతాడు. ఆ ప్రాక్టీస్ ఆయనకే దక్కుతుంది. అంటే వాళ్లకు ప్రభుత్వ ఉద్యోగాలే అక్కర్లేదు. మరి వాళ్లెందుకు ఆందోళన చేస్తున్నారు? రిజర్వేషన్ల వ్యతిరేక ఆందోళనలను మీరు విశాఖపట్నంలో చూస్తూనే ఉంటారు. హైదరాబాద్‌లో మేము చూస్తూనే ఉన్నాం.... విజయవాడలో కానీ, గుంటూరులోకానీ అగ్రభాగాన నిలబడిందెవరంటే...మెడికల్ స్టూడెంట్లు, ఇంజనీరింగ్ స్టూడెంట్లు. వాళ్లెవరికీ ప్రభుత్వ ఉద్యోగాలు అక్కర్లేదు. వాళ్లు కాంట్రాక్టులు చేసుకుంటారు. ప్రైవేట్ క్లినిక్‌లు పెట్టుకుంటారు. అపోలో హాస్పిటల్‌లో ఉద్యోగాలు

చేస్తారు. సీడీఆర్ హాస్పిటల్‌లో ఉద్యోగాలు చేస్తారు. మెడినోవా లాంటి కంప్యూటరైజ్డ్ డయాగ్నిస్టిక్ సెంటర్లలో ఉద్యోగాలు చేస్తారు. అమెరికాకు పోతారు.

ప్రభుత్వ ఉద్యోగాలు ఎవరికైతే అవసరమే లేదో వాళ్లే ముందు నిలబడి ఊరేగింపులు తీస్తున్నారంటే, వాళ్లే ఆందోళన చేస్తున్నారంటే దీన్ని మనమెలా అర్థం చేసుకోవాలో వాళ్లే మనకు చెప్తున్నారు - ఇది ఉద్యోగాల సమస్య కాదు అని. మరి ఏ సమస్య అంటే...ఈ దేశంలో అధికారాన్ని కానీ, సంపదను కానీ, ఆధిపత్యాన్ని కానీ, పెత్తనాన్ని కానీ నిలబెట్టే అనేకానేక శక్తుల్లో కులవ్యవస్థ అనేది ఒక బలమైన శక్తిగా పనిచేస్తూ ఉంది. ఆ కులవ్యవస్థను రిజర్వేషన్లు ఎంతో కొంత దెబ్బతీస్తాయి. కులవ్యవస్థను దెబ్బతీసేటటువంటి ఏ చర్యను కూడా వారు సహించరు. ఎందుకంటే తమ ఆధిపత్యాన్ని పెత్తనాన్ని నిలబెట్టుకోవటానికి అదొక సాధనంగా పనిచేస్తోంది కాబట్టి. అందువల్లే ఇంత బలంగా వాళ్లు ముందుకు వస్తూ ఉన్నారు.

మనం ఇటువేపు నుంచి - ప్రజాస్వామికవాదులు, పౌరహక్కుల ఉద్యమంలో పనిచేసేవాళ్లు, ప్రజల తరపున ప్రజా పక్షపాతంతో ఆలోచించే వాళ్లు అందరం ఏం అర్థం చేసుకోవాలి అంటే కులవ్యవస్థ అన్నదాన్ని నాశనం చేయనిదే ఈ దేశంలో ప్రజాస్వామ్యం అనేది సమగ్రం కాదు, సంపూర్ణం కాదు అని. అంబేద్కర్ చాలాసార్లు అనేవారు ఈ దేశంలో ప్రజాస్వామ్యం రావాలన్నా, ఈ దేశంలో సోషలిజం రావాలన్నా, అక్కడిదాకా ఎందుకు...ఈ దేశంలో ఒక నాగరిక సమాజం రావాలన్నా కులవ్యవస్థ పోనిదే రాదు అని చెప్పి. పౌరహక్కుల సంఘం ఎందుకోసం పనిచేస్తోంది ఈ దేశంలో అంటే...నక్సలైట్ల కోసం కాదు, మరొకరి కోసం కాదు, ఇంకొకరి కోసం కాదు, ప్రజాస్వామిక విలువల్ని కాపాడటం కోసం పనిచేస్తోంది. మనం మన దేశాన్ని ఒక ఆధునిక ప్రజాస్వామిక సమాజంగా చెప్పుకుంటున్నాం. ఆధునిక ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని రాసుకున్నాం మనం. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ప్రజాస్వామ్యం అని చెప్పుకుంటున్నాం మనం. ఈ దేశంలో ప్రజాస్వామిక విలువల్ని కాపాడటం కోసం ఒక ఉద్యమం అవసరం అని చెప్పి పౌరహక్కుల సంఘం పనిచేస్తూ ఉంది. ఆ ప్రజాస్వామిక విలువల్లో అత్యంత కీలకమైనది ఈ కులవ్యవస్థని నాశనం చేయటమనేది. కులతత్వాన్ని నాశనం చేయటమనేది. కొందరు ఎక్కువ, కొందరు పుట్టుకతోనే ప్రతిభావంతులు, కొందరు పుట్టుకతోనే అసమర్థులు అనేటువంటి ఈ భావనను నాశనం చేయాలి అనేది. అందులో అంతర్భాగంగా, కులవ్యవస్థను నాశనం చేయవలసినటువంటి ఆ ప్రజాతంత్ర పోరాటంలో అంతర్భాగంగా చూస్తూ ఈ రిజర్వేషన్లను సమర్థించాలని పౌరహక్కుల సంఘం అనుకుంటూ ఉంది.

వెనుకబడ్డ కులాల వాళ్లు కులం వాడుకుని ఒక గుమాస్తా ఉద్యోగం సంపాదించుకుంటాం, ఒక కాలేజీ సీటు సంపాదించుకుంటాం, కొంచెం బాగా బతుకుతాం అంటే ఇంత గొడవ చేస్తున్నారు. ఈ గొడవ చేసేవాళ్లే కులం వాడుకుని అనేకం సంపాదించుకుంటూ ఉంటారు. ఇవాళ ఒక ఎమ్మెల్యే సీటు కావాలన్నా, పార్లమెంటు టికెట్ కావాలన్నా, జిల్లా పరిషత్ ఎన్నికల్లో టికెట్ కావాలన్నా, ఒక కాంట్రాక్టు కావాలన్నా, ఒక లైసెన్స్ కావాలన్నా, ప్రైవేట్ సెక్టార్‌లో ఒక ఉద్యోగం కావాలన్నా, ఏది కావాలన్నా కులం ఒక ప్రధానమైన సాధనంగా అగ్రకులాలకు ఉపయోగపడుతూ ఉంది. వాళ్లకే అందుబాటులో ఉంటుంది కాబట్టి వాళ్లు దాన్ని ఉపయోగించుకుంటూ ఉంటారు. తండ్రులు కులాన్ని వాడుకుని కాంట్రాక్టులు సంపాదించుకుని, తండ్రులు కులాన్ని వాడుకుని లైసెన్సులు సంపాదించుకుని, తండ్రులు కులాన్ని వాడుకుని ఒక పరిశ్రమ పెట్టటానికి అవసరమైన అప్పులు సంపాదించుకుని, తండ్రులు కులాన్ని వాడుకుని కో ఆపరేటివ్ సొసైటీలో ఆధిపత్యాన్ని సంపాదించుకుని, బ్యాంకుల రుణాలు సంపాదించుకుని, అలా డబ్బులు సంపాదించుకుంటున్నారు. ఆ కులాన్ని వాడుకుని డబ్బులు, ఆస్తులు సంపాదించుకున్న తండ్రుల నుంచే కొడుకులకు ప్రతిభ వస్తూ ఉంది. ఆ ప్రతిభను వాడుకునే కొడుకులు ఇవాళ పైకి పోతూ ఉన్నారు. వాళ్లేమంటారంటే మీరు కులాన్ని వాడుకోవటానికి వీల్లేదు. మీరు కులాన్ని వాడుకుని రిజర్వేషన్లు పొందటానికి వీల్లేదు అని అంటారు. ఏదైనా అంటే ఆర్థిక ప్రాతిపదిక మీద మాత్రమే రిజర్వేషన్లు ఇవ్వాలని వాళ్లు ఇవాళ మాట్లాడుతూ ఉన్నారు. మామూలుగా ఎవరైనా ఈ దేశంలో డబ్బున్నవాళ్లు - లేనివాళ్లు, ధనికులు - పేదలు ఉన్నారు అని అంటే నువ్వు నక్సలైటువు అంటారు. ఇవాళ మాత్రం ఈ దేశంలో ధనికులూ పేదలు మాత్రమే ఉన్నారు, వేరే తేడాలేమీ లేవని చెప్పి వాళ్లు అంటున్నారు. అక్కడే మనకు అనుమానం రావాలి. మామూలుగా ధనికులు, పేదలు అనే వ్యత్యాసం గురించి మాట్లాడితేనే నువు నక్సలైటువు అనే వాళ్లు, ఇవాళ వాళ్లే ఎందుకు ధనికులు పేదలు అన్న ఒకే ఒక్క వ్యత్యాసం ఉందీ అని అంటున్నారు. ఎందుకు అంటున్నారు అంటే కేవలం పేదరికం అనే ప్రాతిపదిక మీద రిజర్వేషన్లు ఇస్తే ఆ రిజర్వేషన్లు మొత్తం కూడా అగ్రకులాలకే పోతాయి. అది మనకందరికీ తెలిసినటువంటి ఒక సామాజిక వాస్తవం. కావాలంటే ఎక్స్‌పరిమెంటుగా ట్రై చేసి చూడండి...ఒక సంవత్సరం, రెండేళ్లు...మొత్తమంతా వాళ్లకే పోతాయి. ఎందుకు పోతాయి అంటే...దాన్ని వాడుకునే సామర్థ్యం కానీ, దానికి కావలసిన రికమెండేషన్లు కానీ, దానికి కావలసిన లింకులు కానీ, ఇంట్లో దానికి కావలసినటువంటి ఒక సాంస్కృతిక వాతావరణం కానీ దళితులతో పోలిస్తే ఈ దేశంలో అగ్రకులాలకు మాత్రమే ఉంది కాబట్టి. సంస్కృతిని, నాగరికతను వాళ్లు తరతరాలుగా సొంతం చేసుకున్నారు కాబట్టి. వెనుకబడ్డ కులాల్ని, దళితుల్ని దాని నుంచి వెలివేశారు కాబట్టి. అందుకే ఇవాళ వాళ్లే దాన్ని వాడుకోగలుగుతారు. పేదరికం అనే ఏకైక ప్రాతిపదిక

మీద రిజర్వేషన్లు ఇస్తే వాళ్లే పొందుతారు. అది మనకు కనపించేటువంటి వాస్తవం. అందుకే వాళ్లు ఇవాళ అంటున్నారు - ధనికులు, పేదలు మాత్రమే ఉన్నారు. వేరే ఎవరూ లేరని చెప్పి వాళ్లు సమాధానం చెప్తున్నారు. మనం ఎదురుతిరిగి కొన్ని మౌలికమైన ప్రశ్నలు వేయాలి.

ఇవాళ ఉత్తర భారతదేశంలో ఈ ఆందోళనకారులు తగలబెట్టుకుని చచ్చిపోతూ ఉన్నారు. అయ్యోపాపం అని అందరికీ అనిపిస్తుంది. ఎందుకు ఓ ప్రాణం పోవాలి? పన్నెండేళ్ల అమ్మాయిలు, పదహారేళ్ల అమ్మాయిలు చచ్చిపోతున్నారు. అయ్యోపాపం అనిపిస్తుంది. అనిపించిన తర్వాత ఆలోచిద్దాం కొద్దిసేపు. ఈ దేశంలో ఎంతోమంది ఆందోళనల్లో చచ్చిపోయారు. ఈ దేశంలో ఎంతోమంది ఉద్యమాల్లో చచ్చిపోయారు. పోలీసు కాల్పుల్లో చచ్చిపోయారు. నక్సలైట్ ఉద్యమాన్ని అణచటం అన్న పేరు మీద ఈ రాష్ట్రంలో 675 మంది ఎన్‌కౌంటర్లలో చచ్చిపోయారు గత 20 ఏళ్లల్లో. వాళ్లందరూ పేదవాళ్లు, గిరిజనులు, కూలీలు, పేద రైతులు. ఆ కుటుంబాల్లో పుట్టి నటువంటి విద్యార్థులు, కార్మికులు. ఎన్నడైనా వారి గురించి ఎవరైనా కన్నీళ్లు కార్చారా? ఎన్నడైనా ఎవరైనా అయ్యో పాపం అన్నారా? ఇవాళ వీళ్ళే ఆందోళనకారులు సజీవ దహనం చేసుకుంటు న్నారు. ఆత్మాహుతి చేసుకుంటున్నారు. సుప్రీంకోర్టు కాపాడాలి. సుప్రీంకోర్టు స్టే ఇవ్వాలి అంటున్నారే. ఇక్కడ ఆంధ్రప్రదేశ్‌లో లేదా బీహార్‌లో లేదా మరొక చోట పేదవాళ్లు ఆందోళనల్లో పోలీసు కాల్పుల్లో చచ్చిపోతున్నారు. ఎన్‌కౌంటర్‌లలో చచ్చిపోతున్నారు. సుప్రీంకోర్టు వెంటనే జోక్యం చేసుకుని భూసంస్కరణలు అమలు చేయించాలి అని వాళ్లెవరైనా ఎప్పుడైనా అన్నారా? భూ సంస్కరణల అమలు కోసం, గిరిజనుల హక్కుల కోసం, గౌరవప్రదమైన జీవితం కోసం ఆందోళన చేసే వాళ్లు ఎన్‌కౌంటర్‌లలో చచ్చిపోతున్నారు. కాల్పుల్లో చచ్చిపోతున్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలి, వాటిని అమలు చేయించాలి అని చెప్పి సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.కె.వేణుగోపాల్‌గారు ఏ రోజైనా సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాడా? ఇవాళ వేస్తున్నాడు.

పోలీసుకాల్పులు జరుగుతాయి ఒక్కోసారి. గాయమైన వాడు అక్కడ పడిపోతాడు. రక్తం కారుతూ ఉంటుంది. పోలీసులు పట్టించుకోరు. పక్కవాళ్లు వచ్చి తీసుకుపోతామంటే పోలీసులు వాళ్లని తంతామంటారు. ఐదు గంటలు, ఆరు గంటలు అక్కడ పడి ఉండి, రక్తస్రావం జరిగి ప్రాణాలు పోతూ ఉంటాయి. ఎవరూ పట్టించుకునే దిక్కుండదు. మధ్యప్రదేశ్‌లో అశోక్‌పాండే - పేరును బట్టే బ్రాహ్మణుడు - ఆ కుర్రవాడు సజీవ దహనం చేసుకునే ప్రయత్నం చేస్తే, ఇంకా పూర్తిగా చనిపోకపోతే, మధ్యప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి సుందర్‌లాల్ పట్వాగారు సొంత ప్రైవేట్ ప్లేన్ ఇచ్చి ఆ కుర్రవాడ్ని బొంబాయి పంపించి జస్‌లోక్ హాస్పిటల్‌లో అడ్మిట్ చేయించాడు. అంటే...మనిషి

ప్రాణం పోతే నీకుండే సానుభూతి కూడా కులపక్షపాతాన్ని బట్టే ఉంటే...ఈ దేశంలో రిజర్వేషన్లు కులం ప్రాతిపదిక మీద అడగాలా, లేకపోతే ఆర్థిక ప్రాతిపదిక మీద అడగాలా అని మనం ప్రశ్నించాలి. నీకు ప్రాణం విలువ కూడా కులం ప్రాతిపదిక మీదే. నీకు సానుభూతి కూడా కులం ప్రాతిపదిక మీదే. నువ్వు చచ్చిపోయే మనిషి గురించి అయ్యోపాపం అనేది కూడా కులం ప్రాతిపదిక మీదే అయితే ఉద్యోగాల్లో కానీ, చదువులో కానీ రిజర్వేషన్లు ఆర్థిక ప్రాతిపదిక మీద ఉండాలనటం ఏ రకమైన న్యాయం అని మనం ఇవ్వాళ వాళ్లను ప్రశ్నించాలి.

అంతే కాదు మనం ఇంకా ముందుకు పోవాలి. మేం బుక్‌లెట్ వేస్తున్నాం త్వరలో. మా పాయింట్ ఏమిటంటే భారతదేశ ప్రగతి గురించి అందరూ మాట్లాడు తున్నారు. దానికోసం ప్రతిభావంతులు అవసరం, మెరిట్ అవసరం అంటున్నారు. ప్రతిభ దేనికోసం అంటే, మెరిట్ దేనికోసం అంటే దేశ భవితవ్యం కోసం, దేశ భవిష్యత్ కోసం అంటున్నారు. అంటే మాకు మాత్రమే ఉద్యోగాలు ఇస్తే, మాకు మాత్రమే చదువుకునే అవకాశం ఉంటే దేశం బాగుపడుతుంది. మీకందరికీ ఇస్తే దేశం నాశనమైపోతుంది అంటున్నారు. ఇవాళ భారతదేశం అనే దేశం గురించి మాట్లాడేవాళ్లు ఈ భారతదేశం అనేది ఎన్ని రకాల ప్రజా పోరాటాలు, ఎన్ని రకాల ఆందోళనలు, ఎన్ని రకాల ఉద్యమాల ఫలితంగా ఏర్పడిందో జ్ఞాపకం ఉంచుకోవాలి. ఆ ప్రజా పోరాటాలు, ఆందోళనలు, ఉద్యమాల నుంచి సంక్రమించిన విలువలేమిటో గుర్తుంచుకోవాలి. ఇవాళ భారతదేశం గురించి గానీ, భారతదేశ భవితవ్యాన్ని గురించి గానీ మాట్లాడేవాళ్లు ఏ పోరాటాలు, ఏ ఆందోళనలు, ఏ ఉద్యమాలు, ఏ సంఘర్షణలు భారతదేశాన్ని రూపొందించటానికి దారితీశాయో ఆ సంఘర్షణల నుంచి పుట్టిన విలువల్ని, ఆ పోరాటాల నుంచి పుట్టిన విలువల్ని, ఆ ఉద్యమాల నుంచి పుట్టిన ఆదర్శాల్ని ప్రాతిపదికగా చేసుకుని మాట్లాడాలి. అట్లా మాట్లాడకుండా వ్యతిరేకంగా మాట్లాడటానికి మీకు అర్హతే లేదని చెప్పి పౌరహక్కుల సంఘం అంటుంది.

జాతీయ ఉద్యమాన్ని ఉదాహరణగా తీసుకోండి. వివేకానందుడు, గాంధీ, కమ్యూనిస్టులు, అంబేద్కర్ ఎవర్నైనా తీసుకోండి. ఎవరి ఉపన్యాసాలైనా చదవండి. ఎవరు రాసిన పుస్తకాలైనా చదవండి. తాము ఊహించే భారతదేశం, తాము స్వాతంత్ర్యం సంపాదించుకోవాలి అని భావించే భారతదేశం, తాము కలలు కనే భారతదేశం కేవలం ప్రతిభావంతులు, సమర్థులు అని కొంతమందిని గుర్తించి, వారి చేతిలో ఉద్యోగాలు పెట్టి, వారి చేతిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెట్టి, వారి చేతిలో ఫ్యాక్టరీలు పెట్టి, వారి చేతిలో భూములు పెట్టి వాళ్ల ప్రగతినే దేశ ప్రగతిగా భావించాలి అని చెప్పి ఆ నాయకులెవరూ ఏ రోజూ అనలేదు.

భారత జాతీయ ఉద్యమ కాలంలో స్వతంత్ర భారతదేశం అంటే ఏమిటి అంటే... ఎన్ని రకాల అసమానతలకు ఈ భారతదేశం తరతరాలుగా నిలయమైందో ఆ అన్ని రకాల అసమానతలను పోగొట్టేదే నిజమైన స్వతంత్ర భారతదేశం అని చెప్పి ఆ రోజున వాళ్లందరూ అన్నారు. కేవలం డబ్బున్నవాళ్లు, డబ్బులేని వాళ్లు అన్న తేడా మాత్రమే కాదు....అగ్రకులాలు, వెనుకబడ్డ కులాలు అన్న తేడా ఉంది. పురుషులు, స్త్రీలు అన్న తేడా ఉంది. అభివృద్ధి చెందిన ప్రాంతాలు, వెనుకబడిన ప్రాంతాలు అన్న తేడా ఉంది. గిరిజనేతరులు, గిరిజనులు అన్న తేడా ఉంది. ఇన్ని రకాల అసమానతలు ఈ దేశంలో ఉన్నాయి. కులాధిపత్యం ఈ దేశంలో ఉంది. పురుషాధిపత్యం ఈ దేశంలో ఉంది. గిరిజనేతరులైన మైదాన ప్రాంతాల వాళ్లు అడవి ప్రాంతాలకు పోయి గిరిజనులు వ్యవసాయం చేసుకుంటున్న భూమిని ఆక్రమించుకోవటం ఈ దేశంలో ఉంది.

అన్ని రకాల అసమానతలు, అన్ని రకాల అన్యాయాలు పోయిననాడే ఇది భారతదేశం అవుతుంది, స్వతంత్ర దేశం అవుతుంది అని చెప్పి వాళ్లందరూ భావించారు. భారత రాజ్యాంగాన్ని పాజిటివ్‌గా చూస్తే, భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామిక దృష్టితో చూస్తే ఆ విలువలు భారత రాజ్యాంగంలో ఉన్నాయి. పౌరహక్కుల సంఘం దృష్టితో చూస్తే...భారత రాజ్యాంగానికి పునాది అయిన విలువలు అవి. రేపు నవంబర్‌లో సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వబోతోంది ఈ కేసు మీద. సుప్రీంకోర్టు ఏం అనబోతోందో నేను ముందుగా ఊహించగలను. ఇవాళ సుప్రీంకోర్టు రిజర్వేషన్లు చెల్లవు అని చెప్పి అనలేదు. అనటం వాళ్లకు సాధ్యం కాదు. రిజర్వేషన్లు ఆర్టికల్ 15 క్లాజ్ 4 కింద చెల్లుతాయి. అయితే సుప్రీంకోర్టు ఏం చేస్తుందంటే రకరకాల మినహాయింపులు పెట్టే ప్రయత్నం చేస్తుంది. మొత్తం 50 శాతం కంటే ఎక్కువ ఉండటానికి వీల్లేదనో; వెనుకబడిన కులాల్లో డబ్బున్న వాళ్లకి ఇవ్వటానికి వీల్లేదనో; కులం ప్రాతిపదిక ఏకైక ప్రాతిపదిక కావటానికి వీల్లేదు, కుల, ఆర్థిక ప్రాతిపదికను కలిపి తీసుకోవాలి అనో; ఏదో ఒక మాట సుప్రీంకోర్టు అనబోతోంది. ఇవాళ సుప్రీంకోర్టుకు మనం ఏం జ్ఞాపకం చేయాలి అంటే...నువ్వు వ్యాఖ్యానిస్తుంది రాజ్యాంగాన్ని. రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించటం అంటే..రాజ్యాంగ వ్యాఖ్యానాన్ని గురించి బ్రిటిష్ వాళ్లు, అమెరికా వాళ్లు రాసిన పుస్తకాలు చదివితే చాలదు. జస్టిస్ చిన్నపరెడ్డి గారు వసంత్‌కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కర్ణాటక కేసులో ఆయన అభిప్రాయాలు చెప్తూ చాలా చక్కటి మాట ఒకటన్నారు....ఇవాళ భారత రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించాలి అంటే సామర్థ్యం ఉంటే చాలదు. ఇది ఇరవయ్యో శతాబ్దం మధ్య భాగంలో ఒక సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం నుంచి పుట్టినటువంటి రాజ్యాంగం. ఇంతకంటే ఉన్నతమైన ప్రపంచం కావాలని చెప్పి కోరుకున్న విప్లవాలేవైతే ఉన్నాయో ఆ విప్లవాలచేత ప్రభావితమైన రాజ్యాంగమిది. అన్ని రకాల సామాజిక ఆర్థిక రాజకీయ అసమానతల్ని పోగొట్టాలి అనే ఆదర్శాలున్నటువంటి రాజ్యాంగమిది, దాన్ని జ్ఞాపకం

పెట్టుకుని వ్యాఖ్యానించాలి...అని చిన్నపరెడ్డిగారు రిజర్వేషన్ల కేసులోనే ఒక తీర్పు ఇచ్చి ఉన్నారు.

నిజానికి చిన్నపరెడ్డిగారి తీర్పు చాలా చక్కటి తీర్పు. దాన్ని మొత్తం కోట్ చేసి ఇవాళ సుప్రీంకోర్టు జడ్జీల ముందు మనం పెట్టాల్సిన అవసరం ఉంది. ఆ పని మనం చేయాలి. పౌరహక్కుల ఉద్యమం చేస్తుంది కూడా. ఈ విషయాలను మనం జ్ఞాపకం చేయాలి సుప్రీంకోర్టుకు. భారత రాజ్యాంగంలో ఎక్కడా కూడా ప్రతిభావంతుల చేతిలో దేశాన్ని పెట్టండి, అది డెవలప్ అవుతుంది అనలేదు. ప్రతిభకు వీళ్లిచ్చిన నిర్వచనం కరెక్టా కాదా అనేది మళ్లీ మాట్లాడుకుందాం. కానీ, ప్రతిభావంతుల చేతిలో దేశాన్ని పెట్టండి.... అది డెవలప్‌మెంట్ అవుతుంది, అది ప్రగతి అవుతుంది అని భారత రాజ్యాంగంలో ఎక్కడా కూడా రాయలేదు.

భారత రాజ్యాంగం భారత ప్రభుత్వానికి కొన్ని ఆదేశాలిచ్చింది. అందులో ప్రధానమైన ఆదేశం ఏమిటీ అంటే...సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయాన్ని ఈ ప్రభుత్వాలు సాధించాలి. ఆర్టికల్ 38లో ఉంది ఈ మాట. కేవలం ఆర్థిక న్యాయం అనలేదు వాళ్లు. సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయం అన్నారు. ఇవ్వాళ ఆర్థిక అసమానతలు ఉన్నాయని అందరూ ఒప్పుకుంటున్నారు. ఆర్థిక అసమానతలు పోగొట్టండి అని కూడా అంటున్నారు. అయితే స్కాలర్‌షిప్‌లు ఇవ్వండి, ట్యూషన్‌లు చెప్పండి, ఫ్రీగా హాస్టల్ వసతి ఇవ్వండి సరిపోతుంది అంటున్నారు. భారత రాజ్యాంగం కేవలం ఆర్థిక న్యాయాన్ని గురించి మాట్లాడలేదు. సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయం గురించి మాట్లాడింది. అట్లా అనటం వెనకాల ఒక చారిత్రక స్పృహ ఉంది వాళ్లకు. ఇవాళ ఏం మాట్లాడుతున్నారు? సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాలని ఆర్టికల్ 15 క్లాజ్ 4లో రాస్తే...రాజ్యాంగం వెనుకబడిన వర్గాలనిందే కాని...వెనుకబడిన కులాలు అనలేదు అని చెప్పి ఇవాళ మాట్లాడుతూ ఉన్నారు. మొదటి రాజ్యాంగ సవరణని పార్లమెంటులో ప్రవేశపెట్టినపుడు అంబేద్కర్ ఒక మాట అన్నాడు. అప్పటికింకా ఆయన బతికే ఉన్నాడు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలు అంటే ఎవరు? అని ప్రశ్న వేస్తే....కొన్ని కులాలు, మతాలు, వాటి సమ్మేళనమే సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలు అని చెప్పి అంబేద్కర్ అన్నాడు. ఆ సంగతిని సుప్రీంకోర్టు జడ్జీలతో సహా అందరూ మర్చిపోతున్నారు. రాజ్యాంగం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలు అని మాత్రమే అంది, వర్గాలు అంటే కులాలు కాదు అని జడ్జీలు సైతం బ్రహ్మాండంగా మిస్‌గైడ్ చేస్తున్నారు.

ఈ దేశంలో ఏ వర్గమైనా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండటానికి ప్రాతిపదిక ఏమిటి? కులమే దానికి ప్రాతిపదిక. తరతరాలుగా ఈ దేశంలో ఏం చేశారంటే నువ్వు పుట్టే కులాన్ని బట్టి నువ్వు వృత్తి చేయాలి. నువ్వు పుట్టే కులాన్ని బట్టి నీకు

చదువుకునే అర్హత ఉందో లేదో మేం నిర్ణయిస్తాం. నువ్వు పుట్టే కులాన్ని బట్టి నీకు ఉన్నతమైన ఉద్యోగాలు చేసే అర్హత ఉందో లేదో మేం నిర్ణయిస్తాం. శూద్రులకి చదువుకునే అర్హత లేదు. శూద్రులకి ఉన్నతమైన పదవుల్ని నిర్వహించే హక్కులేదు. శూద్రులకి రాజ్యాధికారం చేసే హక్కు లేదు. శూద్రులకు ఆస్తి కలిగివుండే హక్కులేదు. శూద్రులకి ఆయుధం పట్టే హక్కు లేదు అని చెప్పి వెలివేశారు. వాళ్లు ఊరుకోలేదు. పోరాటాలు చేశారు. శూద్రుల్లో కొందరు ముందుకొచ్చారు. సమ్మెలు చేశారు. పోరాడారు. బ్రాహ్మణ ఆధిక్యాన్ని వ్యతిరేకించారు. వాళ్లలో కొందరివాళ కమ్మ, రెడ్డి, వెలమ, రాజు కులాలకు చెందిన వాళ్లు ముందుకొచ్చి అగ్రకులాల్లో భాగమయ్యారు.

మన సంస్కృతిలో ఇవాళ్టికి కూడా ఈ ధోరణే కొనసాగుతోంది. దాని ప్రాతిపదిక మీదే మన విద్యారంగం అనేది ఇవాళ రూపొందించబడింది. దాని ప్రాతిపదిక మీదే విజ్ఞానం అన్నదానికి నిర్వచనం ఇస్తున్నారు. మీరు ఈ రోజు ప్రతిభ అంటున్నారు. ప్రతిభకు మీరిచ్చిన నిర్వచనమేమిటి? పుస్తకాల విజ్ఞానం. పుస్తకాల్లో ఉన్నటువంటి విషయాన్ని బాగా చదువుకుని, నువ్వు పరీక్షలో బాగా మార్కులు తెచ్చుకుంటే నీకు ప్రతిభ ఉన్నట్టు. లేకపోతే లేనట్టు. పుస్తకాల్లో ఉండేదే విజ్ఞానం. ఆ విజ్ఞానంలో రాణిస్తే అదే ప్రతిభ. ఆ ప్రతిభ ఉన్నవాళ్లకే ఉద్యోగాలు ఇవ్వాలి. ఆ ప్రతిభ ఉన్నవాళ్ళకే కాలేజీలో సీట్లివ్వాలి. వేరే వాళ్లకివ్వకూడదు. వేరే వాళ్లకిస్తే దేశం నాశనమైపోతుంది. అది ఉండేవాళ్లకి ఇస్తేనే దేశం డెవలప్ అవుతుంది అని చెప్పి ఇవాళ వాదిస్తూ ఉన్నారు. ఎదురుతిరిగి మనం ఏం సమాధానం చెప్పాలంటే...ఏం ప్రశ్న వేయాలంటే....సమాజంలో అందరికీ కూడా విజ్ఞానం ఉంటుంది. ఏయే వృత్తులు చేస్తారో ఆ వృత్తుల్లో అందరికీ విజ్ఞానం ఉంటుంది. కమ్మరి పనిచేసే వాళ్లకి ఆ పనిలో విజ్ఞానముంటుంది. కుమ్మరి పనిచేసే వాళ్లకి ఆ పనిలో విజ్ఞానముంటుంది. బట్టలు నేసే వాళ్లకి ఆ పనిలో విజ్ఞానం ఉంటుంది. చివరికి శవాలను మోసుకుపోయి తగలబెట్టే వాళ్లకు కూడా ఆ పనిలో విజ్ఞానముంది. అది నీకు చేతకాదు కూడా. వాళ్లు తగలబెట్టాల్సిందే. ఈ అన్నిరకాల విజ్ఞానమేదైతే ఉందో అది సహస్ర వృత్తుల విజ్ఞానం. దానికి బ్రాహ్మణ సంస్కృతి విజ్ఞానంగా గుర్తింపు ఇవ్వలేదు. దేన్ని విజ్ఞానమనింది అంటే స్మృతులు, ఉపనిషత్తులు, వాటికి సంబంధించిన జ్ఞానాన్ని మాత్రమే విజ్ఞానమనింది. దాంట్లో రాణించటమే విద్య అనింది. ఆ విద్యలో ఎవరికైతే ప్రతిభ ఉంటుందో వాళ్లే ప్రతిభావంతులు అనింది.

ఇవాళ మనం మన పాఠ్య పుస్తకాలలో, మన సిలబస్‌లో, మన కరిక్యులమ్‌లో అదే సంస్కృతిని, అదే బ్రాహ్మణ జ్ఞాన సిద్ధాంతాన్ని అరువు తీసుకుని అమలు చేస్తూ ఉన్నాం. పదో తరగతి, ఎనిమిదో తరగతి పాఠ్యపుస్తకాలు తీసుకోండి. ఏమున్నాయి దాంట్లో? తిక్కన భారతం పద్యాలు, పోతన భాగవతం పద్యాలు, అబ్రహాం లింకన్ జీవిత చరిత్ర, జాన్ ఎఫ్ కెనడి జీవిత చరిత్ర, అమెరికా స్వాతంత్ర్య పోరాటం. ఇవి

ఎవరు సులభంగా చదువుకోగలుగుతారు? ఎవరి సంస్కృతిలో ఎవరి నాగరికతలో ఇవి భాగమైపోయాయి అంటే...ఎవరైతే తరతరాల బ్రాహ్మణ సంస్కృతికి వారసులో వాళ్లు, ఎవరైతే వెస్ట్రనైజ్ అయ్యారో, ఎవరైతే పాశ్చాత్య సంస్కృతిని తమదిగా ఓన్ చేసుకున్నారో వాళ్లు. అంటే ఈ దేశంలో వెస్ట్రనైజ్ అయినవాళ్లు, బ్రాహ్మణీకానికి చెందిన వాళ్లు, అటువంటి వాళ్లకు మాత్రమే ఈ విద్య అనేది - వాళ్ల విద్యగా, వాళ్ల సంస్కృతిగా, వాళ్ల నాగరికతగా అబ్బుతుంది.

చదువుకుంటే నాలుక కోసేస్తాం, చెవిలో సీసం పోస్తాం అని అనబడ్డ వాళ్లు వీళ్లతో సమానంగా పోటీపడగలుగుతారా? దీని బదులు ఇవాళ మీరు సిలబస్ మార్చండి. సిలబస్ మార్చి తిక్కన  భారతం పద్యాలు తీసేయండి. పోతన భాగవతం పద్యాలు తీసేయండి. అబ్రహాం లింకన్, జాన్ ఎఫ్ కెనడి, అమెరికా సంయుక్త రాష్ట్రాలు అవి మొత్తం తీసేయండి. తీసేసి, వ్యవసాయం ఎట్లా చేయాలి? ఏ పంట ఏ రకంగా వేయాలి? ఏ కలుపుకు, ఏ పురుగులకు ఏ రకమైన మందులు వాడాలి? ఇవి పాఠ్యాంశాలుగా పెట్టండి. అప్పుడు ఎవరు రాణిస్తారు? ఎవరు రిజర్వేషన్లు కావాలంటారు? అప్పుడు బ్రాహ్మణులు మాకు రిజర్వేషన్ కావాలని అడుగుతారు. ఇవన్నీ మావి కావు. మాకు అనుభవం లేదు. మాకు అలవాటు లేదు. ఇది మా సంస్కృతి కాదు కాబట్టి మాకు రిజర్వేషన్లు ఇవ్వండి అని చెప్పి వాళ్లడుగుతారు. బ్రాహ్మణులే కాదు. శ్రమ నుంచి వేరుపడిన వాళ్లందరూ కూడా అడుగుతారు. కేవలం బ్రాహ్మణులే కాదు. చాలా అగ్రకులాలు ఉన్నాయి. వాళ్లందరూ కూడా ఇవి మావి కావు, మా సంస్కృతి కాదు. మాకు రిజర్వేషన్లు ఇవ్వండని చెప్పి డిమాండ్ చేస్తారు.

విజ్ఞానానికి నువ్వు ఇచ్చిన నిర్వచనమేమిటి? విద్యకు నువ్విచ్చిన నిర్వచన మేమిటి? ఏ జ్ఞానాన్ని నువ్వు విజ్ఞానమని గుర్తిస్తున్నావు? దేనిని నువ్వు విద్యగా గుర్తిస్తున్నావు? ఇవన్నీ వదిలిపెట్టేసి, విజ్ఞానాన్ని గురించి, విద్యను గురించి అప్రజా స్వామికమైన వైఖరి ఒకటి ప్రవేశపెట్టి, ప్రజాస్వామిక సంస్కృతిని మొత్తం పక్కకు పెట్టేసి నువ్వు ప్రతిభను నిర్వచిస్తున్నావు. ఎవరినైతే ప్రతిభ నుంచి, ఈ విద్య నుంచి, ఈ విజ్ఞానం నుంచి బలవంతంగా వెలివేశారో...వెలివేయకపోతే వాళ్లకూ ఇవన్నీ అబ్బి ఉండేవి. కానీ బలవంతంగా వాళ్లను వెలివేశారు....వాళ్లతో నువ్వు ఇవాళ సమానంగా పోటీపడు అని అంటున్నావంటే....ఇది హిపోక్రసీ. ఇది ద్వంద్వ నీతి.

అందుకే భారత రాజ్యాంగంలో కులవ్యవస్థ అనేది సామాజిక అసమానతలకు, విద్యాపరమైన అసమానతలకు ఒక ప్రధానమైన ప్రాతిపదిక అనే స్పృహ ఉంది. విచిత్ర మేంటంటే....కుల వ్యతిరేక పోరాటాలు ఈ దేశంలో నడిచాయి కాబట్టి వాటి ఫలితంగా భారత రాజ్యాంగంలో కులవ్యవస్థ ఇక మీదట చెల్లదు, కుల ప్రాతిపదిక మీద వివక్ష పాటించటానికి వీల్లేదని చెప్పి ఆర్టికల్ 15 క్లాజ్ 1లో రాస్తే దాన్ని ఎవరు వాడుకున్నారయ్యా

అంటే కుల వివక్షకు గురైనవారు వాడుకోలేదు. కుల వివక్షకు గురిచేస్తున్న వాళ్లు వాడుకుంటున్నారు. అలాగే చట్టం అందరినీ సమానంగా చూడాలి, చట్టం అందరికీ సమానమైన సంరక్షణ కల్పించాలి అని చెప్పి ఆర్టికల్ 14 అంటుంది. దాన్నెవరు వాడుకున్నారంటే....చట్టం ఎవరిని తక్కువగా చూసిందో, చట్టం ఎవరికి సంరక్షణ కల్పించలేదో వాళ్లు వాడుకోలేదు. భూస్వాములు వాడుకున్నారు. భూస్వాములు వాడుకుని ఏం చేశారు అంటే భూసంస్కరణల చట్టాలు అనేవి కేవలం భూస్వాములకు అన్యాయం చేస్తున్నాయి కాబట్టి, అందరికీ సమాన సంరక్షణ కల్పించలేదు కాబట్టి మాకు అన్యాయం జరిగింది అని చెప్పి వాళ్లు భూసంస్కరణల చట్టానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో కేసు వేశారు. దానికి భయపడి ప్రభుత్వం భూ సంస్కరణల చట్టాలన్నింటినీ కూడా నైన్త్ షెడ్యూల్‌లో పడేసి...వీటిని ప్రశ్నించటానికి వీలులేదు, ఆర్టికల్ 14కు వ్యతిరేకం అనటానికి వీలు లేదు అని చెప్పి బయటపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పేదవాళ్ల కోసం, వివక్షకు గురైన వాళ్ల కోసం, అన్యాయానికి గురైన వాళ్ల కోసం చట్టం ఎవరికైతే సంరక్షణ కల్పించలేదో వాళ్లకోసం చేసిన చట్టాలు, వాళ్ల కోసం ఏర్పాటు చేసినటువంటి ప్రాథమిక హక్కులు వాళ్లకి వ్యతిరేకంగా వాళ్ల మీద ఆధిపత్యాన్ని ప్రయోగించిన వాళ్లే, వాళ్ల మీద వివక్షను ప్రయోగించిన వాళ్లే వాడుకుంటున్నారు. ఈ కేసులో కూడా అదే జరుగుతూ వచ్చింది. ఆర్టికల్ 15 క్లాజ్ 1లో కులం ప్రాతిపదిక మీద, మతం, స్త్రీ పురుషులు, ప్రాంతం, భాష ప్రాతిపదిక మీద ప్రభుత్వం వివక్ష పాటించటానికి వీల్లేదు అని అంటే దాన్ని ఎవరు వాడుకున్నారు? ఇవాల్టి తమిళనాడులో అంటే ఒకప్పటి మద్రాసు రాష్ట్రంలో మొత్తం ఉద్యోగాలన్నీ, ఉన్నత చదువంతా కూడా బ్రాహ్మణుల చేతుల్లో ఉండేది. దానికి వ్యతిరేకంగా శూద్ర కులాల్లో అగ్రకులాలైనటువంటి వాళ్లు పోరాడి తమ కోసం కొంత కోటా వాళ్లు రిజర్వు చేసుకున్నారు. ఇది బ్రిటిష్ కాలంలో జరిగింది. మరి రాజ్యాంగం వచ్చి కులవివక్ష ఉండటానికి వీలు లేదు అన్నప్పుడు ఏం జరిగిందంటే....ఒక బ్రాహ్మణ స్త్రీ, చంపకం దొరైరాజన్ అనే ఆమె సుప్రీంకోర్టులో కేసు వేసింది. ఏమని అంటే...బ్రాహ్మణులకు 10 శాతం సీట్లు మాత్రమే పెట్టటమన్నది కులవివక్ష అవుతుంది కాబట్టి....ఇది మాకు అన్యాయం, ఇది రాజ్యాంగానికి వ్యతిరేకం అంది. సుప్రీంకోర్టు దాన్ని అంగీకరించింది. నిజమే ఇది కులవివక్ష అంది.

అప్పుడు భారత పార్లమెంటు మొట్టమొదటి రాజ్యాంగ సవరణ చేపట్టి 1951లో ఆర్టికల్ 15 క్లాజ్ 4ను చేర్చింది. చేర్చి ఏమన్నారు అంటే....ప్రభుత్వం సామాజికంగాను, విద్యాపరంగాను వెనుకబడినటువంటి వర్గాల కోసం, వారి అభ్యున్నతి కోసం సదుపాయాలు ఏమన్నా కల్పిస్తే...అది కులవివక్ష అవదు అని చెప్పి ప్రత్యేకంగా రాశారు.

ఆ సందర్భంలోనే సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడ్డ వర్గాలు ఎవరు అనంటే అంబేద్కర్ ఈ మాట అన్నాడు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడ్డ వర్గాలు అంటే కొన్ని కులాలు, మతాలు తప్ప వేరేమీ కాదు అని ఆయన స్పష్టంగా సమాధానం చెప్పాడు. ఆ రోజే నిజానికి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడ్డ వర్గాలు అన్న మాట వాడకుండా వెనుకబడ్డ కులాలు అన్న మాట వాడేసి ఉంటే ఈ ఇబ్బందులు ఉండేవి కాదు. కానీ ఆ రోజు వాడలేదు. రేపు సుప్రీంకోర్టు ఏం తీర్పు చెప్పినా ఇవాళ మనం మన ఆందోళనలో భాగంగా ప్రధానమైన డిమాండ్ ఏం పెట్టాలి అంటే భారత రాజ్యాంగాన్ని మరొక్కసారి సవరించి ఆర్టికల్ 15 క్లాజ్ 4ని మార్చి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడ్డ వర్గాలు అనే మాట తీసేసి వెనుకబడ్డ కులాలు అనే మాట స్పష్టంగా అందులో రాయాలి అని. ఎందుకంటే సామాజికంగా విద్యాపరంగా వెనుకబడి ఉండటానికి కులం, కుల ఆధిపత్యమనేదే ప్రాతిపదిక కాబట్టి. అదే ప్రధాన ప్రాతిపదిక కాబట్టి దాన్ని అక్కడ వాడాలి అని మనం డిమాండ్ పెట్టి ముందుకు పోవలసిన అవసరం ఇవాళ ఉంది.

రేపు సుప్రీంకోర్టు తీర్పులో ఈ మాట ఉంటుంది. మనకు బాగా తెలుసు. ఆ వాదన పెడతారు వీళ్లు. కె.కె.వేణుగోపాల్‌రావుగారు, వీళ్లు, చాలా ప్రతిభావంతులు. ఆయనకు ప్రతిభ ఎక్కడినుంచి వచ్చిందంటే వారి తండ్రి కె.కె.నంబియార్‌గారు పెద్ద లాయరు సుప్రీంకోర్టులో. కాబట్టి ఆయన ఆఫీసు, ఆయన పరపతి, ఆయనకుండే కనెక్షన్లు అన్నీ ఆయన కుమారుడికి సంక్రమిస్తాయి. అట్లా కె.కె.వేణుగోపాల్‌గారు నెలకు లక్ష రూపాయలు సంపాదించే లాయరయ్యాడు. ఆయనకు ప్రతిభ అట్లా వచ్చింది.

ఇవ్వాళ వీళ్లేమంటారంటే ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పిస్తే ప్రతిభ లేనివాళ్లు ముందుకొచ్చేస్తారు కాబట్టి దేశం నాశనమైపోతుందని, ప్రతిభావంతులను ఏరి వాళ్లకే ఉద్యోగాలు ఇవ్వాలంటున్నారు. ఇందాక ఇక్కడ నినాదాలు ఇచ్చారు. ఏమని అంటే... మీరు ఆస్తులు వదులుకుంటే మేం రిజర్వేషన్లు వదులుకుంటాం అని చెప్పి. దాని వెనుక ఒక లాజిక్ ఉంది. ఏమనంటే ఆస్తి కూడా ఒక రిజర్వేషనే. తండ్రి ఆస్తి కొడుక్కే ఎందుకివ్వాలి? కొడుక్కి ప్రతిభ లేకపోవచ్చు. వాడు ఉత్త శుంఠ కావచ్చు. మరి ఆస్తిని సక్రమంగా నిర్వహించటమనేది, ఆస్తిని సమర్థవంతంగా నిర్వహించటమనేది దేశ భవితవ్యానికి అవసరం కాదా? ఒక ఫ్యాక్టరీని సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించలేక పోతే అది దేశానికి నష్టం కాదా? ఇక మీదట ఒక ఫ్యాక్టరీ ఓనర్ చచ్చిపోతే వాడి ఆస్తిని, వాడి పిల్లలు సమర్థవంతులు కాకపోతే సమర్థవంతులైన ఇతరులకు ఇచ్చేలా చట్టంలో మార్పులు చేద్దామా? భూస్వామి చచ్చిపోతే వాడి భూమిని నాట్లు వేయటంలో, కలుపు

తీయటంలో సమర్థవంతులు ఎవరైతే ఉంటారో వాళ్లకి ఇచ్చేస్తామంటే, అలా చట్టం చేస్తే ఒప్పుకుంటారా?

సుప్రీంకోర్టు లాయర్లు ఇవాళ మెరిట్ పోతోంది అని రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో కేసు వేశారు. స్టే తెచ్చుకున్నారు. మరి ఆ సుప్రీంకోర్టు లాయర్లు మేం అలాంటి ఒక చట్టం చేస్తామంటే ఒప్పుకుంటారా? ఒక బిల్లు పెడతాము సమర్థిస్తారా? అని అడుగుతున్నాం మేము. లాయర్ చచ్చిపోతే, డాక్టర్ చచ్చిపోతే ఆయనగారి ప్రాక్టీసు కొడుక్కో, కూతురికో, కోడలికో ఇకనుంచి సంక్రమించదు అని చట్టం తెస్తే! ఢిల్లీ విశ్వవిద్యాలయంలో చాలా సమర్థవంతుడైన, చాలా ప్రతిభావంతుడైన లా గ్రాడ్యుయేట్ ఎవడైతే వాడికి ఆ ప్రాక్టీస్ ఇచ్చేస్తామంటే ఒప్పుకుంటారా? ఒప్పుకోరు. ఇన్ని రకాల రిజర్వేషన్లు సమాజంలో ఉన్నాయి. ఆస్తి ఒక రిజర్వేషను, రికమండేషన్ ఒక రిజర్వేషను. అన్నింటినీ మించి మనవాడు అనేది చాలా కామన్‌గా వాడే మాట. మనవాడు వాడు, వాడికిద్దాం. మావాడు వాడు, వాడికిద్దాం అని అంటుంటారు. అదొక రిజర్వేషన్. అవన్నీ ఎవరికి అందుబాటులో ఉన్నాయంటే... అగ్రకులాల వాళ్లకే ఇవి ఎక్కువగా అందు బాటులో ఉన్నాయి. అవేవీ రిజర్వేషన్లుగా మీరు గుర్తించరు. రికమెండేషన్ గానీ, ఆస్తి గానీ, పరపతి గానీ, లంచాలిచ్చే డబ్బు గానీ ఇవన్నీ ఎవరికైతే అందుబాటులో ఉండవో...అంటే అప్రకటితంగా, అలిఖితంగా ఉండే రిజర్వేషన్లు ఎవరికైతే అందు బాటులో ఉండవో.... వాళ్లేమి చేస్తారంటే మాకు ప్రకటిత రిజర్వేషన్లు ఇవ్వండి, మాకు లిఖితంగా రిజర్వేషన్లు ఇవ్వండి....ఎందుకంటే అలిఖితంగా ఉన్న రిజర్వేషన్లు మాకు ఎలాగూ దక్కవు కాబట్టి అనంటే...మెరిట్ పోతుంది, అసమర్థులు అధికారంలోకి వచ్చేస్తారు అనిచెప్పి ఇంత ఆందోళన చేస్తారా మీరు? ఇది ఏ రకమైన హిపోక్రసీ? ఏ రకమైన ద్వంద్వనీతి?

ఒక తరం తర్వాత రిజర్వేషన్లు ఉండటానికి వీల్లేదు అంటున్నారు. రెండు తరాల తర్వాత రిజర్వేషన్లు ఉండటానికి వీల్లేదు అంటున్నారు. ఆదాయ పరిమితి ఉండాలని అంటున్నారు. ఇవాళ మంచి పబ్లిక్ స్కూళ్లు, మంచి కాన్వెంట్ స్కూళ్లలో చదువుకునే అవకాశం డబ్బున్న వాళ్ల కుటుంబాలకే ఉంది. తల్లిదండ్రులు చదువుకున్న వాళ్లు. కాన్వెంట్ స్కూల్లో చదువుకున్నవాళ్లు. పబ్లిక్ స్కూళ్ళలో చదువుకున్నవాళ్లు. మరి వాళ్ల పిల్లలకు ఆ రిజర్వేషన్ చెల్లదు అంటే ఒప్పుకుంటారా? ఇవాళ మనం ఒక చట్టం చేద్దాం. ఏమని అంటే...తల్లిదండ్రులు కాన్వెంట్ స్కూల్లో చదువుకుంటే, పబ్లిక్‌స్కూల్‌లో చదువుకుంటే వాళ్ల పిల్లలు ప్రభుత్వ స్కూల్‌కే పోవాలి. లేకపోతే ఒకే కుటుంబంలో తరాల తరబడి ఆ సౌకర్యాన్ని వాడుకుంటున్నట్టు అవుతుంది కాబట్టి, అది వివక్ష అవుతుంది కాబట్టి..... అని అంటే ఒప్పుకుంటారా? పబ్లిక్ స్కూళ్లలో, కాన్వెంట్ స్కూళ్లలో

ఇకనుండి అగ్రకులాల్లో డబ్బుండే వాళ్లకు ప్రవేశం ఉండదు. పేదవాడికే ప్రవేశం ఉంటుంది. ఎందుకంటే డబ్బున్న వాళ్లే అక్కడ సీట్లు కొట్టేస్తున్నారు. పేదవాళ్లకేం దక్కటం లేదు అంటే ఒప్పుకుంటారా?

రిజర్వేషన్ల వల్ల బీసీల్లో డబ్బున్న వాళ్లే బాగుపడుతున్నారు అని చెప్పటం చాలా విచిత్రమైన వాదన. ఈ దేశంలో అన్ని కాలాలలో డబ్బున్నవాళ్లే బాగుపడ్డారు. హరిత విప్లవం వచ్చింది వ్యవసాయంలో....ఎవరు బాగుపడ్డారు? అందరు రైతులు బాగుపడ్డారా? డబ్బున్న వాళ్లే బాగుపడ్డారు. కానీ దానిని డబ్బున్న వాళ్ల ప్రగతి అన్నారా? భూస్వాముల ప్రగతి అన్నారా? లేదే. దేశం ప్రగతి అన్నారు. ఇంజనీరింగ్ కాలేజీలు, యూనివర్సిటీలు, మెడికల్ కాలేజీలు వచ్చాయి. ఎవరు బాగుపడ్డారు? డబ్బున్న వాళ్లు బాగుపడ్డారు. దానిని డబ్బున్న వాళ్ల ప్రగతి అన్నారా? లేదే. దానిని దేశ ప్రగతి అన్నారు. పరిశ్రమలు వచ్చాయి. ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ వచ్చింది. ఎవరు బాగుపడ్డారు? డబ్బున్నవాళ్లు బాగుపడ్డారు. దాన్ని డబ్బున్న వాళ్ల ప్రగతి అన్నారా? లేదే. దేశ ప్రగతి అన్నారు. మరి బీసీల్లో డబ్బుండే వాళ్లు రిజర్వేషన్ల వల్ల బాగుపడితే దాన్ని దేశ ప్రగతి అని ఎందుకు అనకూడదు? దాన్నెందుకు బీసీల్లో డబ్బున్నవాళ్ల ప్రగతి అనాలి? దాన్నెందుకు ఎస్సీలలో డబ్బున్నవాళ్ల ప్రగతి అనాలి? మొత్తం ఈ వాదనలోనే ఎంత హిపోక్రసీ ఉంది, ఎంత ద్వంద్వనీతి ఉంది అనేది మనం కొంచెం ఆలోచించాలి.

కానీ రేపు ఈ వాదన రాబోతోంది సుప్రీంకోర్టులో. ఏమని అంటే డబ్బున్న వాళ్లకి రిజర్వేషన్ ఇవ్వకూడదు. పేదవాళ్లకే ఇవ్వాలి. ఒక తరం తరవాత రిజర్వేషన్ ఇవ్వకూడదు. మొదటి తరానికి మాత్రమే ఇవ్వాలి. ఈ ఆర్గ్యుమెంట్లు రేపు రాబోతాయి. యాభై శాతం కంటే ఎక్కువ ఉండకూడదు అని మరో వాదన. విచిత్రమైన వాదన ఇది.

గజేంద్ర గడ్కర్ అని చెప్పి ఇప్పటి మన సుప్రీంకోర్టు జడ్జీల్లో బాగా పేరున్న జడ్జీ ఆయన. 1963లో బాలాజీ అనే ఒక వ్యక్తి మైసూరు రాష్ట్రంలో బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వటానికి వ్యతిరేకంగా కోర్టులో కేసు వేశాడు. ఆ కేసు సుప్రీంకోర్టుకు పోయింది. గజేంద్ర గడ్కర్ తీర్పు ఇచ్చారు. ఆ తీర్పులో మొట్టమొదటిసారిగా ఆయన అన్న వాక్యం - ఐ యామ్ స్పీకింగ్ వెరీ రిలక్టంట్లీ అన్నాడు. చాలా సంశయంతో నేను మాట్లాడు తున్నాను అన్న మాట వాడాడు. అదెవరూ ఇవాళ చెప్పరు మీకు. ఆయన సంశయంతో చెప్తున్నానని చెప్తూ అన్న మాటల్ని మాత్రం కోట్ చేస్తున్నారు. రిజర్వేషన్లు యాభై శాతం కంటే ఎక్కువ ఉండకుండా ఉంటే బాగుంటుంది అని ఆయనన్న మాటను మాత్రం అందరూ కోట్ చేస్తున్నారు. అదేదో శిలాశాసనం అయినట్టు. నాకు రాజ్యాంగం అర్థమైనంతవరకు, నాకు జ్యూరిస్‌ప్రుడెన్స్ అర్థమైనంతవరకు, నాకు చట్టం అర్థమైనంత

వరకు....రిజర్వేషన్లు అనేవి చట్టపరంగా చెల్లుబాటు అవుతాయా? కావా? రిజర్వేషన్లు అనేవి రాజ్యాంగపరంగా చెల్లుబాటు అవుతాయా? కావా? అని తీర్పు చెప్పే అధికారం సుప్రీంకోర్టుకు ఉంది కానీ...ఇంత ఉండొచ్చు, ఇంత ఉండకూడదు అని తీర్పు చెప్పే అధికారం మాత్రం సుప్రీంకోర్టుకు లేదు. ఇది నా అభిప్రాయం మాత్రమే కాదు. ఆ తీర్పు ఇచ్చిన ఇరవై ఏళ్ల తర్వాత సుప్రీంకోర్టు జడ్జీలు కూడా ఇదే అభిప్రాయాన్ని చెప్పారు.

*వసంత్‌కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కర్ణాటక కేసులో*......నలభై శాతమో, యాభై శాతమో, అరవై శాతమో చెప్పే అధికారం సుప్రీంకోర్టుకు ఎవరిచ్చారు అని జస్టిస్ చిన్నపరెడ్డిగారే అన్నారు. సుప్రీంకోర్టుకు ఆ అధికారం లేదు. పార్లమెంటుకు ఉంది. పార్లమెంటు రాజ్యాంగాన్ని సవరించి యాభై శాతం మాత్రమే ఉండాలి అంటే అదొక అధికారం. న్యాయమో అన్యాయమో అదొక అధికారం. సుప్రీంకోర్టుకు ఆ అధికారం లేదు.

జస్టిస్ ముర్తజా ఫజల్ అలీ ఒక మాట అన్నారు. ఒక రాష్ట్రంలో వెనుకబడ్డ వర్గాలు 80 శాతం ఉన్నారనుకోండి. మరి 80 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం అనుకుంటే అది తప్పవుతుందా? ఎనభై శాతం వెనుకబడ్డ వర్గాలు ఉంటే యాభై శాతమే ఇవ్వాలని చెప్పి ఎట్లా నియమం పెడతారు అని ఆయన ప్రశ్నించారు. కానీ రేపు సుప్రీంకోర్టు బహుశా 50 శాతం నియమం పెట్టబోతోంది. మేం జనాభాలో 52 శాతం ఉన్నాము. 27 శాతం మాత్రమే ఎందుకిస్తారు మాకు? మాకు 52 ఇవ్వండి అని రేపు బీసీలు అడుగుతారు. అలా అడగకుండా 50 శాతం కంటే ఎక్కువ ఉండటానికి వీల్లేదు అనే నియమం పెట్టటానికి సుప్రీంకోర్టు ప్రయత్నం చేస్తుంది రేపు.

అట్లాగే రేపు ముస్లింలు అడుగుతారు. మన దేశంలో ముస్లింలు సామాజికంగా వెనుకబడ్డవాళ్లు చాలావరకు...వాళ్లు అడుగుతారు మాక్కూడా రిజర్వేషన్లు ఇవ్వండి అని చెప్పి. కానీ 50 శాతం కంటే దాటటానికి వీల్లేదు కాబట్టి, ఇప్పటికే ఇచ్చేశాం కాబట్టి మీకు లేదుపో అనాలి. అందుకోసం ఇప్పుడే 50 శాతం అనబోతారు. మనం ముందే జాగ్రత్తపడి ఎంత శాతం కంటే ఎక్కువ రిజర్వేషన్లు ఉండటానికి వీల్లేదో, వీలుందో చెప్పే అధికారం సుప్రీంకోర్టుకు లేదు అని చెప్పాలి. ఈ విషయాన్ని గతంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులే ఒప్పుకున్నారు. జస్టిస్ డే ఒప్పుకున్నారు. జస్టిస్ బేగ్ ఒప్పుకున్నారు. ముర్తజా ఫజల్ అలీ ఒప్పుకున్నారు. చిన్నపరెడ్డి ఒప్పుకున్నారు అని చెప్పి మనం ఇవ్వాళ జ్ఞాపకం చేయాలి.

దీని గురించి మనం పార్లమెంటు మీద ఒత్తిడి పెట్టాలి. రాజకీయ పార్టీలన్నీ కూడా రిజర్వేషన్లకు అనుకూలమని చెప్పుకుంటున్నాయి కదా. కాంగ్రెస్ పార్టీ, టీడీపీ, జనతాదళ్, బీజేపీ అందరూ కూడా. వాళ్లందరూ కలిసి రాజ్యాంగాన్ని సవరించాలి. సవరించి 70 శాతం గానీ, 80 శాతం గానీ రిజర్వేషన్లకు గరిష్ట పరిమితి ఉండటానికి

వీల్లేదు. అవసరాన్ని బట్టి ఉంటాయి. పరిమితి పెట్టటానికి వీల్లేదని చెప్పి మనం డిమాండ్ చేయాలి. అలాగే రాజ్యాంగాన్ని సవరించి ఆర్టికల్ 15 క్లాజ్ 4లో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడ్డ వర్గాలు అనేది కులాలను ఉద్దేశించే అని స్పష్టం చెయ్యాలి.

మనది సెక్యులర్ రాష్ట్రం అయినపుడు కులం ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వకూడదు అని విచిత్రమైన ఆర్గ్యుమెంట్ తీసుకొస్తున్నారు. కులాన్ని గుర్తించకూడదు అంటే....కులం ఉండకూడదు అంటే.....ఇవాళ లేదని కాదు....భవిష్యత్‌లో ఉండ కూడదని, భవిష్యత్‌లో కుల వివక్ష లేని సమాజం నిర్మించుకోవాలని. దానికోసం ఇవాళ కులం ఉందని గుర్తించాలి. కులవివక్ష ఉందని గుర్తించాలి. దానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలి. కులవ్యవస్థని, కుల వివక్షని, కుల ఆధిపత్యాన్ని అంతం చేయటానికి కావాల్సిన పోరాటం చేయాలి.

రిజర్వేషన్లు ఒక్క భారతదేశంలో మాత్రమే కాదు అన్ని దేశాల్లో ఉన్నాయి. అమెరికాలో నల్లవాళ్లకి రిజర్వేషన్లు ఇచ్చారు. ఎందుకంటే వాళ్లు బానిసలుగా అమెరికా సమాజంలోకి ప్రవేశించారు. తర్వాత బానిసత్వం నుండి విముక్తి లభించినా సామాజికంగా ఇప్పటికీ వాళ్లు వెలివేయబడ్డవాళ్లే. తెల్ల సమాజం వాళ్లని ఇప్పటికీ తమలో కలుపుకోలేదు. అందుకోసం వాళ్లకు కొన్ని ప్రత్యేక సదుపాయాలు ఇవ్వాలని అమెరికా ప్రభుత్వం భావించింది. అప్పుడు తెల్లవాళ్లు అమెరికా సుప్రీంకోర్టులో కేసు వేశారు. కేసు వేసి ఏమన్నారు అంటే....అమెరికా రాజ్యాంగంలోని మొట్టమొదటి వాక్యమే 'ఆల్ మెన్ ఆర్ బోర్న్ ఈక్వల్'. అంటే మనుషులందరూ పుట్టుకతో సమానులు అని. కాబట్టి ఇక రిజర్వేషన్లు ఎందుకు? అన్నారు. అమెరికా సుప్రీంకోర్టు ఏమని చెప్పిందంటే....అందరూ సమానంగా పుట్టారు అనేది ఒక ఆదర్శం. ఇవాళ్టి వాస్తవం కాదది. ఆ ఆదర్శాన్ని అందుకోవాలి అంటే ఇవాళ్టి వాస్తవం తద్భిన్నంగా ఉందని గుర్తించి, దానిని పోగొట్టటం కోసం మనం ప్రయత్నించాలి అని. అప్పుడు కేసు వేసిన వాళ్లు 'ది అమెరికన్ కాన్‌స్టిట్యూషన్ ఈజ్ కలర్ బ్లైండ్' అని అన్నారు. అంటే రంగుని గుర్తించదు. తెలుపు రంగుని గుర్తించదు అని. అమెరికా సుప్రీంకోర్టు ఏమనిందంటే....'ఇఫ్ యు వాంట్ టు బి కలర్ బ్లైండ్ ఇన్ ద లాంగ్ రన్....యు మస్ట్ రెఫ్యూజ్ టు బి కలర్ బ్లైండ్ ఇన్ ది షార్ట్ రన్' అని చెప్పి తీర్పు ఇచ్చింది. ఈ రకమైన వాదనలు కొత్తవేం కాదు.

ఆఫ్రికాలో చాలా దేశాల్లో తెగలుంటాయి. మనకు కులాలున్నట్టే. ఒక తెగ చాలా బలంగా ఉంటుంది. ఆ తెగే పరిపాలన చేస్తుంటుంది. అధికారాలు వాళ్ల చేతుల్లో ఉంటాయి. మిగిలిన తెగల వాళ్లు రిజర్వేషన్లు డిమాండ్ చేస్తున్నారు. పొందుతూ ఉన్నారు. యూరప్ దేశాల్లో కులాలు లేవు, తెగలు లేవు. అలాగే నల్లజాతి, తెల్లజాతి లేవు. కానీ స్త్రీలకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు ఉన్నాయి. శతాబ్దాల తరబడి స్త్రీలు విద్య నుండి,

ఉద్యోగాల నుండి, చాలా వృత్తుల నుండి బయటపెట్టబడ్డారు కాబట్టి, కుటుంబానికే పరిమితం చేయబడ్డారు కాబట్టి....ఆ దేశాలలో స్త్రీలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. ఏ ప్రాతిపదిక మీద మనుషుల్ని సామాజికంగా, విద్యాపరంగా బయటపెట్టారో అదే ప్రాతిపదిక మీద మనుషులకి లోపలకు రావటానికి అవకాశం కల్పించాలన్నది కామన్‌సెన్స్. దానికి వ్యతిరేకంగా ఇవాళ ఆర్థిక ప్రాతిపదికే అంటున్నారంటే...ఆర్థిక ప్రాతిపదిక మీద మాత్రమే వాటిని ఇచ్చేస్తే...మొత్తం రిజర్వేషన్లు రేపు అగ్రకులాల వాళ్లే కొట్టేయొచ్చు కాబట్టి ఆ కుట్రతో వాళ్లా మాట అంటున్నారు తప్ప....వేరే ఏమీ కాదని చెప్పి మనం గుర్తించాలి.

ఇవాళ ప్రభుత్వ ఉద్యోగాలు తీసేయండి. ప్రైవేట్ సెక్టార్ ఎవరి చేతుల్లో ఉంది? భూములు ఎవరి చేతుల్లో ఉన్నాయి? ఆస్తులు ఎవరి చేతుల్లో ఉన్నాయి? పరిశ్రమలు ఎవరి చేతుల్లో ఉన్నాయి? వ్యాపారాలు ఎవరి చేతుల్లో ఉన్నాయి? మొత్తం అగ్రకులాల చేతుల్లో ఉన్నాయి. వాటిలో ఉద్యోగం కావాలంటే...ఒక గుమాస్తా ఉద్యోగమైనా, ఒక టెక్నీషియన్ ఉద్యోగమైనా, ఒక సూపర్‌వైజర్ ఉద్యోగమైనా...చాలామంది కులాన్ని వాడుకుంటున్నారు. హైదరాబాద్ దగ్గర పఠాన్‌చెరు అని, కుషాయిగూడ అని, నాచారం అని చెప్పి ఇండస్ట్రియల్ ఎస్టేట్లు ఉన్నాయి. అక్కడ ఫ్యాక్టరీలున్నాయి. ఆ ఫ్యాక్టరీలు పెట్టిన వాళ్లు ఎవరూ అంటే...మీ కోస్తా జిల్లాలకు చెందినటువంటి పెట్టుబడిదారులు. కమ్మగానీ, రెడ్డిగానీ, కాపుగానీ, రాజుగానీ వాళ్లు పెడుతున్నారు. అక్కడ పనిచేసే కార్మికుల్లో మూటలు మోసేవాళ్లని, ఊడ్చేవాళ్లని మినహాయిస్తే....వాళ్లు స్థానికులు, మిగిలిన వాళ్లంతా ఎవరు అంటే ఏ గ్రామాల్నుంచి, ఏ ప్రాంతంనుంచి, ఏ జిల్లా నుంచి ఆ పెట్టుబడిదారుడు వచ్చుంటాడో....అదే గ్రామాల నుంచి, అదే ప్రాంతం నుంచి, అదే జిల్లా నుంచి ఎక్కువగా వాళ్ల కులాల వాళ్లే వచ్చి ఉంటారు. అయ్యో పాపం మనవాడట్రా ఒక అటెండర్ ఉద్యోగం ఇవ్వండి, మనవాడే ఒక సూపర్‌వైజర్ ఉద్యోగం ఇవ్వండి, మనవాడే ఒక గుమాస్తా ఉద్యోగం ఇవ్వండి అని చెప్పి అట్లా ఉద్యోగాలు పొందిన వాళ్లే ఎక్కువ ఉంటారు.

అగ్రకులాల్లో పేదవాళ్లు లేరని కాదు. అగ్రకులాల్లో పేదవాళ్లకి నిరుద్యోగ సమస్య లేదని కాదు. కానీ అగ్రకులాల్లోని పేదవాళ్లకి కులం అనేది ఇవాళ ఎంతోకొంత ఆసరాగా, ఎంతోకొంత చేయూతగా ఉపయోగపడుతోంది. వ్యవస్థ నిర్మాణం వల్ల వాళ్లకి కులం ఉపయోగపడుతోంది. ఎవరికైతే వ్యవస్థ నిర్మాణం వల్ల కులం ఉపయోగపడటం లేదో వాళ్లు రిజర్వేషన్ల నుండి ఉపయోగం పొందనీయండి. ఎవరికైతే మనవాడు అన్న సంబంధం వల్ల కులం ఉపయోగపడుతుందో వాళ్లకి రిజర్వేషను అక్కర్లేదు. ఎవరికైతే మనవాడు అన్న సంబంధం వల్ల కులం ఉపయోగపడదో వాళ్లకు రిజర్వేషన్లు చట్టపరంగా, లిఖితపూర్వకంగా ఇవ్వండి అని చెప్పి మనం డిమాండ్ చేస్తున్నాం. దానికింత

గొడవెందుకు? రభసెందుకు? వాళ్లు అన్నిటికీ కులాన్ని వాడుకుంటున్నారు కాని లేనివాడు వాడుకుంటే మాత్రం అదొక నేరమైపోతుంది. ప్రతిభ నాశనమైపోతుందని, మెరిట్ నాశనమైపోతుందని, అసమర్థులు ముందుకు వచ్చేస్తారని వాళ్లు ఎంత అసహ్యంగా, ఎంత జుగుప్సాకరంగా వాదిస్తున్నారో మనం చూస్తూనే ఉన్నాం. వెనుకబడ్డ కులాల వాళ్లు రిజర్వేషన్ల ద్వారా వచ్చేసి - వాళ్లు డాక్టర్లైతే కన్ను తీసేయమంటే కాలు తీసేస్తారు. ఇంజనీర్లైతే బ్రిడ్జి కడితే అది కూలిపోతుంది. ఐఏఎస్ ఆఫీసర్లయితే ఒక ఫైలు మీద సంతకం చేయమంటే ఇంకో ఫైలు మీద చేస్తారు - ఇలా ప్రచారం చేస్తున్నారు. మనం చాలా సింపుల్‌గా ఒక పని చేద్దాం. ఇప్పటిదాకా అంటే గత 43 ఏళ్లలో తప్పుడు ఆపరేషన్లు చేసిన డాక్టర్లు, కూలిపోయిన బ్రిడ్జీలు కట్టిన ఇంజనీర్లు...వాళ్ల జాబితా బయటకు తీయండి. వాళ్ల కులాలు బయటికి తీయండి. వాళ్లందరూ ఏ కులాల వాళ్ళో చూసి చెప్పమని అడుగుదాం. వాళ్లంతా అగ్రకులాల వాళ్లే అయి ఉంటారు. వాళ్లే కదా ఇప్పటిదాకా విద్యావంతులు. అంతా ప్రతిభావంతులే. వాళ్లకు లేనిది నీతి, ప్రతిభ కాదు.

మనం ప్రతిభ గురించి మాట్లాడేటపుడు ఇంకో విషయం మరచిపోకూడదు. సమాజానికి ఒక మనిషి ఉపయోగపడాలంటే....ఏ ప్రాతిపదిక మీద ఉపయోగపడతాడు? పుస్తక విజ్ఞానం మాత్రమే ఉంటే చాలదు. అదీ ఉండాలి. దానితోపాటు నీతి ఉండాలి. ప్రజలంటే ప్రేమ ఉండాలి. సమాజమంటే పట్టింపు ఉండాలి. నిజాయితీ ఉండాలి. పనిలో నిమగ్నత ఉండాలి. ఇవన్నీ ఉన్న వాళ్ల ప్రతిభ, ఇవన్నీ ఉన్న వాళ్ల పని సమాజానికి ఉపయోగపడుతుంది. అదే సమాజానికి విలువైనది. వీటిలో ఏ ఒక్కటి లేకపోయినా సరే అది పనికి మాలిన ప్రతిభ అవుతుంది. దానికి విలువ లేదు. అటువంటి వాళ్లని ప్రతిభావంతులనటమనేది ప్రతిభ అనే మాటని అపహాస్యం చేయటం అవుతుంది.

రీజనల్ ఇంజనీరింగ్ కాలేజి అని చెప్పి వరంగల్‌లో ఒక ఇంజనీరింగ్ కాలేజి ఉంది. ఐఐటి తర్వాత సోకాల్డ్ ప్రతిభావంతులు వచ్చేటటువంటి కాలేజీ అది. అక్కడ అగ్రకుల విద్యార్థులు, బీసీ, ఎస్‌సీ విద్యార్థులు ఇద్దరూ చాలా కాలంగా ఆందోళన చేస్తూనే ఉన్నారు. వీళ్లు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా, వాళ్లు అనుకూలంగా...ఎవరి పని వాళ్లు చేసుకుంటున్నారు. వీళ్లేమో కాలేజీ బాయ్‌కాట్ చేస్తారు. వాళ్లేమో అటెండ్ అవుతారు. పంతుళ్లు ఏం చేస్తారంటే....సగం మందే వస్తే మేం చదువేం చెప్తామని చెప్పి వాళ్లు పాఠం చెప్పరు. అట్లా నడుస్తోంది చాలా కాలంగా. మొన్నొక రోజు రిజర్వేషన్ల వ్యతిరేకులు....రిజర్వేషన్ల అనుకూల విద్యార్థులను రెచ్చగొడుతూ వాళ్లకి కుంకుమబొట్లు పెట్టటం, చేతులకు గాజులు తొడగటం వంటి పనులు చేశారు. వాళ్లు రెచ్చిపోయారు. రెచ్చిపోయి రెండు కొట్టారు. వీళ్లేం చేశారంటే ఆ రోజు రాత్రి హాస్టళ్లు వెతికి వెతికి

ఎస్.సి. విద్యార్థుల రూముల తలుపులు పగలగొట్టి, వాళ్ల డిగ్రీ సర్టిఫికెట్లు తగలబెట్టి, వాళ్ల బట్టలు తగలబెట్టి, వాళ్ల సూట్‌కేసులు మొత్తం తగలబెట్టి బీభత్సం చేశారు.

నేను ఆ ఇంజనీరింగ్ కాలేజీలో చాలాకాలం చదువుకున్నాను. అక్కడ ర్యాగింగ్ జరిగేది. ఈ ర్యాగింగ్ జరిగేటప్పుడు ఎటువంటి ర్యాగింగ్ చేసే వాళ్లో మేం చూసే వాళ్లం ప్రతి సంవత్సరం. రిజర్వేషన్ల మీద వచ్చిన విద్యార్థులను పట్టుకుని....వాళ్ల మాటలు చెప్పాలి కాబట్టి చెప్తున్నాను...ఒరే మాలోడా, నా తమ్ముడికి 70 పర్సంట్ వచ్చిందిరా. అయినా సీటు రాలేదు. నువ్వు మాలోడివి కాబట్టి నీకు 40 పర్సెంట్ వచ్చినా వచ్చిందిరా... అంటారు. ర్యాగింగ్‌లో భాగమిది. ర్యాగింగ్ ఎందుకోసం చేస్తారు అంటే...కాలేజీలో అందరి మధ్యా మంచి సంబంధాలు ఏర్పడటం కోసం, కొత్త చోట విద్యార్థులు ఇమడటం కోసం. కాని వాళ్లు ఇలాంటి మాటలు వాడతారు. రిజర్వేషను ద్వారా వచ్చిన విద్యార్థుల్ని కులం పేరు పెట్టి చాలా అసహ్యంగా అక్కడ ర్యాగింగ్ చేస్తారు.

నేనొక షెడ్యూల్డు కులానికి చెందిన విద్యార్థిననుకోండి. 40 శాతం మార్కులతో నాకు సీటు వచ్చిందనుకోండి. 70 శాతం వచ్చినోడికి నావల్ల రాకుండా పోతుంది అంటున్నారు కదా. వాదన కోసం కాసేపు ఆ సీటు నీకే రావాలని ఒప్పుకుంటాను. ఎప్పుడొప్పుకుంటాను అంటే 70 శాతం వచ్చిన నువ్వు ఈ దేశంలో ప్రజలకు పనికొచ్చే ఉద్యోగం చేసేట్లయితే, నా ప్రజలను నువ్వు ఉద్ధరించేట్లయితే, నాకంటే ఎక్కువ ఉద్ధరించేట్లయితే నేనొదులుకున్నా పర్వాలేదని అనుకుంటాను. కానీ నువ్వేం చేస్తావ్? అత్యంత ప్రతిభావంతులు అనుకుంటున్న వాళ్లు కాలేజీ పాస్ అయిన తర్వాత ఏం చేస్తున్నారు? వాళ్లివాళ జూబ్లీహిల్స్‌లో, బంజారాహిల్స్‌లో లక్షాధికారులకు ఆర్కిటెక్ట్‌గా ఇళ్లు డిజైన్ చేస్తున్నారు. కంప్యూటరైజ్డ్ డయాగ్నస్టిక్ సెంటర్లలో డాక్టర్లుగా పనిచేస్తున్నారు. పేదవాళ్లకి ఇవాళ కాదు, రేపు కాదు, ఏ రోజూ అందుబాటులో ఉండబోని అపోలో హాస్పిటల్‌లో డాక్టర్లుగా పనిచేస్తున్నారు. అమెరికాకి పోతున్నారు. ఈ దేశానికి ఎందుకూ ఉపయోగపడని విలువల్లేని నీ ప్రతిభ కోసం నేనెందుకు నా సీటు పోగొట్టుకోవాలి? నేను కనీసం చదువుకుని నా ప్రజలకోసం సేవ చేస్తాను కదా అని ఎదురు ప్రశ్న వేస్తే ఏం సమాధానం చెప్తారు?

నిజానికి రిజర్వేషన్ల మీద వచ్చే విద్యార్థులు చాలామంది చదువుకుని అగ్రకులాల వాళ్లకంటే ఎక్కువ రాణిస్తున్నారు. డిస్టింక్షన్ మార్కులతో పాసవుతున్నారు. సీటు రిజర్వేషన్ మీద వచ్చినా సరే అంతిమంగా పాసయ్యేది మార్కులొస్తేనే కదా? మరి ఇంకెందుకు ఈ మాటలు? యోగ్యత లేని వాళ్లు పైకొస్తే, వాళ్లు డాక్టర్లైతే, వాళ్లు ఇంజనీర్లైతే దేశం నాశనమైపోతోందన టానికి వాళ్లకున్న ఆధారం ఏమిటి? ఎంతోమంది చాలా మంచి మార్కులతో పాసవు తున్నారు. సమర్థవంతంగా ఉద్యోగాలు చేస్తున్నారు.

అసలు ప్రతిభకు మీరిచ్చే నిర్వచనం ఏమిటి? లంచగొండ్లు, దేశాన్ని నాశనం చేసేవాళ్లు, సిమెంటును బ్లాక్ మార్కెట్ చేసేవాళ్లు మీ టి.సుబ్బిరామిరెడ్డిగారిలాగా....వీళ్లా ప్రతిభావంతులు?

మా డాక్టర్ రామనాథంగారి వర్ధంతి జరుపుతున్నారు ఇవాళ. రామనాథంగారు ప్రతిభావంతుడు. ఎందుకంటే ఆయన బ్రాహ్మణుడు కాబట్టి కాదు. ఆయన బ్రాహ్మణుడే. అందుకోసం కాదు. ఆయన డాక్టరు. మంచి మార్కులతో పాసయ్యాడు. కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్‌లో గవర్నమెంట్ హాస్పిటల్‌లో డాక్టర్‌గా పనిచేశాడు. అది పంచాయతీ సమితి ఆధ్వర్యంలో నడిచేటువంటి హాస్పిటల్. ఆ పంచాయతీ సమితి నడిపే హాస్పిటళ్లలో మందుల కొనుగోలు, మందులు ఇవ్వటం మొత్తం అంతా కూడా పంచాయతీ సమితి పెద్దల ఆధ్వర్యంలోనే జరగాలి. వాళ్లకు ఆ మందులు అమ్ముకోవటం కోసం అవకాశం కల్పించాలి. వాళ్ల అవినీతికి కూడా అవకాశాలు కల్పించాలి. రామనాథం అది కల్పించేవాడు కాదు. పంచాయతీ పెద్దలు డబ్బులు కాజేసే అవకాశం కల్పించేవాడు కాదు. మొత్తం పంచాయతీ సమితిలో ఉన్న గూండాలందరూ కలిసి ఆయనను చంపేయాలని ప్రయత్నం చేశారు. ఒక లారీ డ్రైవర్‌కు తాగబోసి, ఈయన గురించి ఏవో అబద్ధాలు చెప్పి చంపమని చెప్పి పంపించారు. ఆ తర్వాత ఆ ప్రాంత ఎమ్మెల్యే గారు కారేసుకుని అక్కడకు వచ్చి...అయ్యా డాక్టర్ రామనాథంగారూ నువ్వు పనికి మాలిన వాడివి, ఇక్కడ ఉంటానికి వీల్లేదు నువ్వు అని చెప్పి తీసుకొనిపోయి పక్కన వేశారు. ఆ ఊళ్లోనూ ఇదే. నువ్వసలు ప్రభుత్వ హాస్పిటల్‌లో పని చేయొద్దు పో అన్నారు. ఆయన కాకతీయ మెడికల్ కాలేజీలో లెక్చరర్‌గా చేరాడు. అప్పుడు కాకతీయ మెడికల్ కాలేజీ డొనేషన్ కాలేజీ. 20 వేల రూపాయలు, 30 వేల రూపాయలు, 50 వేల రూపాయలు డొనేషన్ ఇచ్చి విద్యార్థులు చేరేవాళ్లు. దానివల్ల ప్రతిభ నాశనమవు తుందని అనుకోలేదు వాళ్లెప్పుడూ.

ఇవాళ విజయవాడలో ఈ ఉద్యమాన్ని నడుపుతున్న వాళ్లను చూడండి. వాళ్లంతా కోనేరు లక్ష్మయ్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులు. అది డొనేషన్ కాలేజి. 20 వేల రూపాయలు, 40 వేల రూపాయలు, ఎన్నారైలైతే వేలాది డాలర్లిచ్చి అక్కడ సీట్లు సంపాయించుకున్నారు. వాళ్లివాళ రిజర్వేషన్ల మీద సీట్లొస్తే ప్రతిభ నాశనమై పోతుందని చెప్పి ఊరేగింపులు తీస్తున్నారు. డొనేషన్ల ద్వారా సీట్లొస్తే, డొనేషన్ల ద్వారా ఇంజనీర్లైతే ప్రతిభ నాశనమైపోతుందని చెప్పి, దేశం నాశనమైపోతుందని చెప్పి వాళ్లెప్పుడూ అనుకోలేదు.

డాక్టర్ రామనాథంగారు అటువంటి కాకతీయ మెడికల్ కాలేజీలో కొనసాగలేక పోయారు. డబ్బుండే వాళ్ల పిల్లల కోసం, డొనేషన్లు ఇచ్చే వాళ్ల కోసం నేను చదువు చెప్పి ఏం చేయాలని చెప్పి ఆయనేం చేశాడంటే....బయటకు వెళ్లిపోయి మూడు

రూపాయల ఫీజు మాత్రమే తీసుకుని వైద్యం చేశాడు. మొట్టమొదటి రోజు నుంచి చివరి రోజు దాకా కూడా మూడే మూడు రూపాయలతో ఆయన పిల్లల డాక్టర్‌గా నిలబడ్డాడు. పేదవాళ్లకి వైద్యం చేయటం మాత్రమే కాదు, వాళ్ల హక్కుల కోసం నిలబడ్డాడు. మాకు భూమి కావాలని, మాకు కూలి కావాలని, మా మీద సామాజిక పెత్తనం అంతం కావాలని, మాకు విముక్తి కావాలని, స్వేచ్ఛ కావాలని పోరాటం చేసే ప్రజానీకాన్ని పోలీస్ క్యాంపులు పెట్టి, చిత్రహింసలకు గురిచేసి, ఎన్‌కౌంటర్‌లో కాల్చిపారేస్తుంటే ఇది అన్యాయమన్నాడు. అన్యాయమన్నందుకు ఆయనను పోలీసులు కాల్చిపారేశారు. ప్రతిభావంతులైన డాక్టర్లకు ఇచ్చేటటువంటి శిక్ష అది. మీ ప్రతిభ ఎటువంటిది అంటే....రోడ్లమీద మీరు బస్సుల అద్దాలు పగలగొడుతుంటే, బస్సులు తగలబెడుతుంటే....పోలీసులు పక్కన నిలబడి చూస్తూ ఉన్నారు. మిమ్మల్ని అరెస్టు కూడా చేయరు. మీ మీద కేసులు కూడా పెట్టరు. అటువంటి ప్రతిభ మీది. ప్రతిభ అంటే ఏమిటి? సామర్థ్యం అంటే ఏమిటి? విద్యకు, విజ్ఞానానికి ఇచ్చే నిర్వచనం ఏమిటి? ఈ దేశ భవితవ్యానికి ఉపయోగపడేటువంటి ప్రతిభ ఎటువంటిది? ఈ ప్రశ్నలన్నీ మనం ఇవాళ వేయాలి. ఈ చర్చను మనం లేవదీయాలి. ఈ ఆర్గ్యుమెంట్‌ను మనం ఇవాళ జనం ముందర పెట్టాలి.

అగ్రకులాల వాళ్లు దేశవ్యాప్తంగా తమకుండే వనరులు, తమకుండేటువంటి వత్తాసును ఎలా ఉపయోగించుకుంటున్నారో చూడండి. పత్రికలు ఎంత అసహ్యమైన ప్రచారం చేస్తున్నాయి - మామూలుగా రాజకీయ విషయాల్లో జోక్యం చేసుకోని పత్రికలు కూడా. ఇండియా టుడే అని ఒక పత్రిక వస్తుంది. తెలుగులో కూడా ఇప్పుడు అనువాదమై వస్తోందది. మామూలుగా రాజకీయ విషయాలపై వాళ్లు కామెంట్ వేయరు. అది జర్నలిజంలో ఒక శైలి అని భావిస్తారు. అందులో ఒక అసహ్యకరమైన కార్టూను.... తెలుగులో వచ్చిందో లేదో నాకు తెలీదు, ఇంగ్లీష్‌లో అయితే వచ్చింది. ఒక ఓడ ఉంటుంది. ఆ ఓడలో ఎస్సీ, బీసీ, ఎస్టీ మనుషులంతా ఉంటారు. రెండు జెండాలు పాతి ఉంటాయి దాంట్లో. ఎస్టీ జెండా, ఎస్సీ జెండా. అంటే వాళ్లకు రిజర్వేషన్లు ఇప్పటికే ఉన్నాయని. వి.పి.సింగ్ వచ్చి బీసీ జెండా పాతుతుంటాడు. ఓడ చుట్టూ సముద్రంలో ఫార్వర్డ్ క్యాస్ట్ విద్యార్థులు డిగ్రీ సర్టిఫికెట్ చేతిలో పట్టుకుని మునిగిపోతుంటారు. వి.పి.సింగ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ వాళ్లు ఓడలో కూర్చుని వీళ్లను చూసి ఇకిలిస్తూ నవ్వుతుంటారు. ఇంత అసహ్యకరమైన కార్టూన్ వేశారు ఆ పత్రికలో. అసలు వాస్తవం దీనికి పూర్తిగా విరుద్ధమైనది. ఓడలో ఎవరున్నారు? నీళ్లలో ఎవరు మునిగిపోతున్నారు? నీళ్లలో మునిగిపోతున్న వారిని చూసి ఓడలో కూర్చుని ఎవరు నవ్వుతున్నారు? వి.పి.సింగ్ ఎవరికి వత్తాసు పలుకుతూ మాట్లాడుతున్నాడు? దేశంలోని వెనుకబడ్డ వాళ్లకి, పేదవాళ్లకి వనరులు తమ చేతుల్లో లేనటువంటి వాళ్లకి...ఈ ప్రభుత్వాలు ఎన్ని పనులు

చేయవచ్చును? ఎన్ని సంస్కరణలు అమలు చేయవచ్చును? ఎన్నిరకాల వనరులు వాళ్ల చేతిలో పెట్టవచ్చును? దానికోసం వి.పి.సింగ్ ఏం చేస్తున్నాడు? ఎన్.టి.రామారావు ఏం చేస్తున్నాడు? మన చెన్నారెడ్డి ఏం చేస్తున్నాడు? ఆ కులాల్లో చదువుకున్న కొద్దిమందికి రిజర్వేషన్లు కల్పించేస్తే వాళ్ల గొంతు మూసేసినట్టు అయిపోతుంది. వాళ్లు ఆ కులాలకు నాయకత్వం వహిస్తున్నారు కాబట్టి, వాళ్లు నాయకులుగా ముందుకొచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి వాళ్లను సైలెన్స్ చేసేస్తే గొడవ లేకుండా ఉంటుందని చెప్పి రిజర్వేషన్ల గురించి మాట్లాడుతున్నారు కానీ....వెనుకబడిన కులాల మొత్తం అవసరాలు ఏమిటి? ఆ మొత్తం అవసరాల కోసం వాళ్లేం చేస్తున్నారు?

భూసంస్కరణలు అమలు చేస్తే ఎవరికి ప్రయోజనం వస్తుంది? ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వస్తుంది. కానీ వాటిని అమలు చేయరు. వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు అమలు చేస్తే ఎవరికి ప్రయోజనం వస్తుంది? ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వస్తుంది. కానీ వాటిని అమలు చేయరు. ఆటోమేషన్, కంప్యూటరైజేషన్, మోడ్రనైజేషన్ పక్కకుపెట్టి గ్రామీణ పారిశ్రామికీకరణ చేపడితే ఎవరికి ఉపయోగం ఉంటుంది? చేతి వృత్తుల వారికి ఉపయోగం ఉంటుంది. కానీ ఆ పని చేయరు.

అక్కడిదాకా పోనక్కర్లేదు. మన రాష్ట్రంలో ఇవాళ రెండు వెనకబడ్డ కులాల వాళ్లు చాలాకాలంగా ఆందోళన చేస్తున్నారు. ఒకటేమిటంటే తాటి కల్లు తీసేటటువంటి... మా తెలంగాణ ప్రాంతంలో గౌండ్ల వాళ్లు అంటారు వాళ్లని. ఈ ప్రాంతంలో కొన్ని చోట్ల ఈడిగ అంటారు కాని గౌడ అనే మాట జనరల్‌గా వాడతారు..వాళ్లు తాటికల్లు అమ్మేటువంటి ఎక్సైజు కాంట్రాక్టు మాకే ఇవ్వాలి, మా సహకార సంఘాలకే ఇవ్వాలి. కాంట్రాక్టు వేలం వేసి ఇస్తుంటే అది తీసుకునే వాళ్లు ఎక్కువగా అగ్రకులాల వాళ్లొస్తున్నారు. వాళ్లకివ్వటానికి వీల్లేదని చెప్పి వాళ్లివాళ ఆందోళన చేస్తున్నారు. ఊరేగింపులు చేస్తున్నారు. పోలీసుల చేతుల్లో లాఠీ దెబ్బలు తింటున్నారు. కానీ....ఇప్పటి దాకా వాళ్ల డిమాండ్‌ని ప్రభుత్వం ఒప్పుకోలేదు. ఎందుకు ఒప్పుకోలేదు? ఆ కులంలో కొద్ది మంది చదువుకుని ఉంటే వాళ్లకు మాత్రం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి వాళ్లను సైలెన్స్ చేసేస్తే...వాళ్ల ఉద్యమాన్ని లాఠీచార్జి చేయవచ్చును. వాళ్లని తన్నొచ్చును. చంపొచ్చును. ఏం పర్వాలేదు అనుకుంటున్నారు.

ఇంకో ఆందోళన కూడా జరుగుతోంది. చేపలు పట్టేవాళ్లు - అగ్నికుల క్షత్రియులు కావచ్చు, పల్లీలు కావచ్చు, వాడబలిజలు కావచ్చు, జాలర్లు కావచ్చు, బెస్త వాళ్లు కావచ్చు - రకరకాల పేర్లతో ఉంటారు. గ్రామాల్లో చెరువులుంటాయి. కొలనులుంటాయి. చిన్న చిన్న ఏరులుంటాయి. అక్కడ చేపలు పట్టేటువంటి అధికారం వాళ్లు తరతరాలుగా

అనుభవిస్తూ వస్తున్నారు. ఇవాళ వాటిని ఏం చేస్తున్నారంటే...వేలం వేస్తున్నారు. ఆ కాంట్రాక్టులు ఎవరు పొందుతున్నారంటే...అగ్రకులాల కాంట్రాక్టర్లే. దానికి వ్యతిరేకంగా వాళ్లు ఆందోళన చేస్తున్నారు. చేపలు పట్టే కాంట్రాక్టులు మాకే ఇవ్వండి. మా సహకార సంఘాలకే ఇవ్వండి. వేరే వాళ్లకి ఇవ్వటానికి వీల్లేదని చెప్పి ఆందోళన చేస్తున్నారు. వాళ్లూ బీసీలే. కానీ ఆ హక్కు వాళ్లకు ఇవ్వరు. దాన్ని వేలం వేస్తూనే ఉంటారు. ఎవరు పొందుతున్నారు వాటిని అంటే కాంట్రాక్టర్లు పొందుతున్నారు. ఎవరు వాళ్లు అంటే అగ్రకులాల వాళ్లు.

భూసంస్కరణలు, కనీస వేతన చట్టం మాత్రమే కాదు పేద ప్రజానీకం జీవనానికి, తిండికి ఏ హక్కులైతే అవసరమో, ఏ సౌకర్యాలైతే అవసరమో అవేవీ చేయటానికి ఈ ప్రభుత్వాలేవీ సిద్ధంగా లేవు. అందులో చదువుకున్న వాళ్ల నోరు నొక్కేయటం కోసం... ఉద్యోగాల్లో కావాలంటే ఉద్యోగాలలో, చదువుల్లో కావాలంటే చదువుల్లో రిజర్వేషన్లు ఇస్తామంటే....ఆ కొద్దిపాటి బాగు కూడా, ఆ కొద్దిపాటి రిజర్వేషన్లు కూడా, ఆ కొద్దిపాటి సంస్కరణలు కూడా వీళ్లివాళ సాగనివ్వటం లేదు. దాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఒక తరానికే ఇవ్వాలి. ఆర్థిక ప్రాతిపదిక మీదే ఇవ్వాలి. డబ్బుండేవాళ్లకి ఇవ్వటానికి వీల్లేదని చెప్పి వీళ్లివాళ వాదిస్తున్నారు. కులాన్ని వాడుకుని, కులాధిపత్యాన్ని వాడుకుని, కులం కనెక్షన్లు వాడుకుని వాళ్లందరూ వాళ్ల కులాల్లో బలమైన వర్గాలుగా ఏర్పడ్డారు. రెడ్లల్లో ఏర్పడ్డారు. కమ్మవాళ్లలో ఏర్పడ్డారు. బ్రాహ్మణుల్లో ఏర్పడ్డారు. రాజుల్లో ఏర్పడ్డారు. ఆ వర్గాలు తమ కులాల్లోని పేదవాళ్లకు కూడా ఎంతో కొంత సహాయం చేసే స్థితిలో ఉన్నాయి ఇవాళ. మరి బీసీలు కానీ, ఎస్సీలు కానీ, ఎస్టీలు కానీ వాళ్లలో కూడా రిజర్వేషన్లు వాడుకుని ఒక బలమైన వర్గం ఎందుకు ఏర్పడకూడదు? అటువంటి బలమైన వర్గం ఏర్పడితే తమ కులాల్లో పేదవాళ్లకు వాళ్లు కూడా సహాయం చేయవచ్చు కదా! తమ కులాల రాజకీయ అవసరానికి వాళ్లొక వ్యక్తీకరణ కల్పించవచ్చును కదా! దాన్ని ఎందుకు వ్యతిరేకిస్తారు? ఏ విషయంలోనూ ప్రతిభకు గుర్తింపు లేదు. ఏ విషయంలోనూ ఆర్థిక ప్రాతిపదిక లేదు. ఏ విషయంలోనైనా అభివృద్ధి అనేది డబ్బున్న వాళ్ల అభివృద్ధే అవుతుంది. పేదవాళ్ల అభివృద్ధి కాదు. అయినా ఎవరూ వాళ్లను ప్రశ్నించలేదు. కేవలం వెనుకబడ్డ కులాల వాళ్లు, దళితులు ఇది మా హక్కు అని ముందుకు వస్తే దానికి ఎందుకు పరిమితులు పెడుతున్నారని మనం ఇవాళ వాళ్లను ప్రశ్నించాలి. ఇవన్నీ మనం ముందుకు తీసుకుపోయి వాళ్లు పెడుతున్న వాదనలను కౌంటర్ చేయాలి.

రిజర్వేషన్ల మీద వచ్చిన వాళ్లకి ప్రతిభ ఉండదని, వాళ్లు అధికారంలోకి వస్తే దేశం నాశనమైపోతుందని అంటున్నారు. 43 ఏళ్లుగా దేశాన్ని ఎవరు ఏలుతున్నారు? దేశంలో మంత్రులెవరు? ఒకవేళ కేబినెట్‌లో ఎవరన్నా ఎస్సీలకు ఒక పోస్టు ఇచ్చినా

అది సోషల్ వెల్ఫేరే అవుతుంది. ఎస్టీలకు ఇచ్చినా అది ట్రైబల్ వెల్ఫేరే అవుతుంది. స్త్రీలకు ఇస్తే అది విమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేరే అవుతుంది. వేరేవి ఇవ్వరు. అధికారం ఉండే శాఖలు, పెత్తనం ఉండే శాఖలు, ఆధిపత్యం ఉండే శాఖలు ఎవరు నిర్వహిస్తున్నారంటే....అగ్రకులాల మగవాళ్లే నిర్వహిస్తున్నారు. ఐఏఎస్ ఆఫీసర్లు వాళ్లే. మన రాష్ట్రంలో 236 మంది ఐఏఎస్ ఆఫీసర్లు ఉంటే దాన్లో 160 మంది బ్రాహ్మణులంట. ఒక్క బీసీ లేడు. ఐఏఎస్ ఆఫీసర్ల కొడుక్కూ రిజర్వేషన్లేనా? అని వీళ్లు అంటున్నారు కదా. కాని ఐఏఎస్ ఆఫీసర్లు అసలు ఎక్కడున్నారు? 236 మంది ఐఏఎస్ ఆఫీసర్లలో ఒక్క బీసీ లేడు మన రాష్ట్రంలో. ఐదుమందో ఆరుమందో ఎస్సీ, ఎస్టీలున్నారు - వాళ్లకు రిజర్వేషన్లు ఉన్నాయి కాబట్టి.

చలసాని ప్రసాద్‌గారు చెప్తున్నారు. మీ ఊళ్లో ఏవీఎన్ కాలేజీ 150 ఏళ్లుగా ఉన్న కాలేజీ అని. మనదేశంలో అతి ప్రాచీనమైన కాలేజీల్లో అదొకటి. ఆ కాలేజీ ప్రిన్సిపాళ్లుగా నూటయాభై ఏళ్లుగా అందరూ బ్రాహ్మణులే. ఒకే ఒక్క అబ్రాహ్మణుడు ఇప్పటిదాకా వచ్చాడు. ఆయన కూడా నాయుడు. అంటే ఏ కమ్మ, కాపు కులానికో చెందినటువంటి వాడాయన. కాలేజీ ప్రిన్సిపాళ్లు మీరే. ఐఏఎస్ ఆఫీసర్లు మీరే. ఇంజనీర్లు మీరే. డాక్టర్లు మీరే. కేబినెట్‌లో మంత్రులు మీరే. భూస్వాములు మీరే. పారిశ్రామికవేత్తలు మీరే. 43 ఏళ్లలో దేశాన్ని ఎక్కడికి తీసుకొచ్చారు మీరు? మీ ప్రతిభావంతుల పరిపాలనలో దేశం ఏమైంది? ఇవాళ దేశంలో ఆర్థిక సంక్షోభాన్ని, ధరల పెరుగుదలను అదుపు చేసేవాడు ఎవడూ లేడు. అవినీతిని ఆపేవాడు ఎవడూ లేడు. ఆశ్రిత పక్షపాతాన్ని ఆపేవాడు ఎవడూ లేడు. రాజకీయ సంక్షోభం, సామాజిక సంక్షోభం, కాశ్మీర్‌లో కల్లోలాన్ని ఆపేవాళ్లు ఎవరూ లేరు. సమాధానం చెప్పేవాళ్లు లేరు. పంజాబ్ సమస్యకు పరిష్కారం లేదు. ఇరాక్‌కు, కువైట్‌కు యుద్ధమైతే మనకు పెట్రోల్ దొరకదు. ఇక్కడిదాకా తీసుకొచ్చారు 43 ఏళ్ల మీ ప్రతిభావంతమైన పాలనలో దేశాన్ని. ఇప్పుడు వేరే వాళ్లు అధికారంలోకి వస్తే, వేరే వాళ్లు ఐఏఎస్ ఆఫీసర్లయితే ప్రతిభ నాశనమైపోతుంది, డెవలప్‌మెంట్ నాశనమై పోతుందంటే....ఇది ఏ రకమైనటువంటి హిపోక్రసీ? వీటిని మనం ఎండగడుతూ, భారత రాజ్యాంగం ఈ దేశంలో జరిగినటువంటి ఏ ప్రజాతంత్ర, ప్రజాస్వామిక పోరాటాలకు, ఉద్యమాలకు, ఆందోళనలకు వారసత్వమైన విలువల్ని వ్యక్తీకరించిందో...ఆ విలువలను మనం ఇవాళ కాపాడుకోవాలి.

ఆ విలువల ప్రాతిపదికగా మాట్లాడేవాడే ఇవాళ దేశభక్తుడు. ఆ విలువలను ప్రాతిపదికగా పెట్టుకుని మాట్లాడేవాళ్లే ఇవాళ భారత రాజ్యాంగాన్ని గౌరవించే వాళ్లు. మనం ఎప్పుడైనా ఈ రాజ్యాంగం పేదవాళ్లకు అన్యాయం చేస్తోంది అంటే, ఈ కోర్టులు పేదవాళ్లకు అన్యాయం చేస్తున్నాయి అంటే...వీళ్లేమంటారు? మీరు దేశద్రోహులు

అంటారు. మీకు రాజ్యాంగం మీద నమ్మకం లేదంటారు. నక్సలైట్లను కాల్చిపారేయటం చట్టవిరుద్ధం అంటే...వాళ్లకు రాజ్యాంగం మీద నమ్మకం లేదు కదా అంటారు. మీకుందా నమ్మకం రాజ్యాంగం మీద? భారత రాజ్యాంగం సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కల్పించాలి అంటుంటే....మీరు ఇవాళ ఏమంటున్నారు? అక్కర్లేదు అంటున్నారు. భారత రాజ్యాంగం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడ్డ వాళ్లకి రిజర్వేషన్లు కల్పించాలి అంటుంటే మీరు ఏమంటున్నారు? కేవలం ఆర్థికంగా ఉంటే చాలంటున్నారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 46లో షెడ్యూల్డు తెగలకు, షెడ్యూల్డు కులాలకు, ఇతర బలహీన వర్గాలకు...వాళ్ల ఆర్థిక పురోగమనం కోసం, వాళ్ల విద్యాపరమైన పురోగమనం కోసం... ప్రత్యేకమైన కృషి చేయాలి అనంటే మీరు అక్కర్లేదంటున్నారు. అంటే మీకు రాజ్యాంగం మీద గౌరవం లేనట్లే కదా. మరి మీరు దేశభక్తులు కాదందామా? మీరు దేశద్రోహులు అంటే ఒప్పుకుంటారా? మిమ్మల్ని ఎన్‌కౌంటర్‌లో కాల్చిపారేస్తే....మీకు రాజ్యాంగం మీద నమ్మకం లేదు కాబట్టి మీకు పౌరహక్కులు వర్తించవు అంటే ఒప్పుకుంటారా దానిని? మీరు దానికి ఒప్పుకోరు. ఒప్పుకోకపోగా...మాకు పత్రికా స్వేచ్ఛ కావాలి. మాకు ఊరేగింపులు చేసే స్వేచ్ఛ కావాలి. మాకు బస్సుల అద్దాలు పగలగొట్టే స్వేచ్ఛ కావాలి. మాకు బస్సుల్ని హైజాక్ చేసే స్వేచ్ఛ కావాలి. మమ్మల్ని అరెస్ట్ చేయటానికి వీల్లేదని అంటారు. పత్రికలు వాళ్లకు ఇంత అసహ్యకరంగా ప్రచారం ఇస్తున్నప్పటికి కూడా....ఇంకా ప్రచారం చాలటం లేదని చెప్పి వాళ్లు పత్రికల మీద దాడులు చేస్తున్నారట. ఆలిండియా రేడియో బయట వాళ్లు ధర్నా చేస్తారట. రేడియోలో వచ్చేవన్నీ వాళ్ల వార్తలే. టీవీలో వచ్చేవన్నీ వాళ్ల ఫొటోలే. పత్రికల్లో వేసే రంగురంగుల ఫోటోలన్నీ వాళ్ల ఫోటోలే. అయినా సరే.

మనం ఇవాళ ఏమనాలంటే....కోర్టు ముందు కేసుంది కాబట్టి...భారత రాజ్యాంగం ఏ విలువల్ని వ్యక్తీకరించిందో - భారత రాజ్యాంగంలోని ప్రజా వ్యతిరేకమైనటువంటి వాటిని పక్కన పెట్టేయండి. ప్రజానుకూలమైనటువంటి, ప్రజాస్వామికమైనటువంటి, ప్రజాతంత్ర పోరాటాల్లో బయటకొచ్చినటువంటి, పెల్లుబికినటువంటి ఏ విలువలైతే భారత రాజ్యాంగంలో ఉన్నాయో, వ్యక్తీకరణ పొందాయో - వాటి ప్రాతిపదిక మీద మనం ఇవ్వాళ వాదించాలి. వాటి ప్రాతిపదిక మీద నిలబడి మాట్లాడేవాళ్లు మాత్రమే ఇవాళ దేశభక్తులు అనాలి. వాటి ప్రాతిపదిక మీద నిలబడి మాట్లాడని వాళ్లు దేశద్రోహులు అనాలి. భారత జాతీయ ఉద్యమానికి వారసులుగా ప్రకటించుకోవటానికి, దానిని సొంతం చేసుకోవటానికి వాళ్లకు అర్హత లేదు, హక్కు లేదు అని మనం అనాలి. ఇవతలి వైపు నుంచి మనం చాలా బలంగా ఒక ఆందోళన, ఒక ఒత్తిడి తీసుకురావాలి. వాళ్లు తీసుకువస్తున్నారు. వాళ్లు సమర్థవంతులు,

ప్రతిభావంతులు. వాళ్ల సామర్థ్యాన్ని, ప్రతిభని - అంటే వాళ్లకుండే డబ్బును, వాళ్లకుండే వనరుల్ని, వాళ్లకుండే వత్తాసును అన్నిటిని వాడుకుని....వాళ్లివాళ సుప్రీంకోర్టు మీద బలమైన ఒత్తిడి పెడుతున్నారు. ప్రతి రోజూ జడ్జీలు పేపరు చదువుతారు. ప్రతి పేపర్లో జడ్జీలకు ఒకటే విజ్ఞప్తి. మీరైనా దేశాన్ని కాపాడాలి. మీరైనా మండల్ కమిషన్‌ను రద్దు చేయకపోతే ఈ దేశం నాశనమై పోతుంది. అయ్యో అబ్బాయిలు, అమ్మాయిలు ఆత్మహత్య చేసుకుంటున్నారు, ఆత్మాహుతి చేసుకుంటున్నారు. మీరే కాపాడాలి అని జడ్జీల మీద బలమైన ఒత్తిళ్లు.